# మియర్ మేల్

## పొయెట్రీ ఫర్ మెన్ ఇన్ తెలుగు

మరొక ఆండ్రోమెడా ప్రచురణ

**mere male**
poems for men in telugu

by arun sagar
mobile: 99482 54504
arunsagart@gmail.com

cover design & special effects
t.suresh babu

type setting & page design
n.raghu ramaiah

printed: jan, 2011

andromeda publication:
202, sarah sadan apts.,
3rd main road, rajiv nagar
yusufguda, hyderabad - 500 045, ap india
phone no. 040-23838121

printed at: venu graphics
barkatpura, hyderabad.

copies: 1,000

price: Rs. 50 ($ 20)

for copies: publication address & prajasakthi, visalandhra,
navodaya all branches.

-నవయవ్వనాన్ని వెలిగించిన దివ్యేకు!

# థాంక్యూ సో మచ్!

కె.శ్రీనివాస్
వసంతలక్ష్మి
డాక్టర్ శివారెడ్డి
ప్రసాదమూర్తి
గుడిపాటి
కుమార్ సోమరాజ్
అఫ్సర్
సీతారాం
ప్రసేన్

రఘురామయ్య
సురేష్‌బాబు
కిషోర్‌దాస్

నవరాగమాలిక

ఈ లిస్టులో పేరు పెట్టకపోతే తాటతీస్తానని బెదిరించే గంగాధర్

ఇంకా
చంద్రమౌళి
స్పెషల్లీ
రవిప్రకాష్

ఎ మెట్రో సెక్స్యువల్ బార్న్ ఇన్ అందమైన ఖమ్మం జిల్లా భద్రాచలం టౌన్. చదువు- భద్రాచలం, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం. పీజీ ఇన్- ఆంత్రోపాలజీ. పని- జర్నలిజం, నౌ ఇన్ టీవీనైన్- నోన్ ఫర్- మేల్‌కొలుపు అనబడు మేల్‌రాతలు. పబ్లిష్డ్- కవితా సంకలనం కాల్డ్ మాగ్జిమమ్ రిస్క్. రెగ్యులర్ కాలమ్స్- ఇన్ ఆంధ్రజ్యోతి.
సంగీతం ఆఫ్ ఆల్‌టైప్స్. తిరుగుడు ఆఫ్ ఆల్ ప్లేసెస్. లాంగ్‌డ్రైవ్. నాక్టార్నల్ నార్సిసస్. విజిబుల్ ఆన్ ఫేస్‌బుక్. రీచబుల్ ఆన్ ఆర్కుట్ కెన్ బి ఫాలోడ్ ఆన్ ట్విట్టర్.

అండ్ స్పెషల్లీ సన్నాఫ్ కామ్రేడ్ టీవీఆర్ చంద్రం, భారతీదేవి.

# ఎబౌట్





# అరుణారుణ సాగర తీరాన...

# 1

**మ**హా వినియోగదారులను ఉద్దేశించి స్ప్రైట్ చిన్నది ఇలా అన్నది: 'సూటిగా మాట్లాడు సుత్తిలేకుండా.' కొడవలి తేకుండా, పిడులు ఊడిన కొడవళ్లు కనీసంగా లేకుండా వచ్చేశాం కనుక ఏమీ చేయలేకపోయాం. తన అప్రతిహత వ్యాపారాసక్తిలో యోగ్యతా, ఆకాంక్షా, ఆసక్తీ లేకుండా లాభాపేక్షా పూరిత వాక్యములన్నీ కవిత్వమై పోయిన కాలంలో ఇక లాభం లేదనుకుని ఈ అరుణ్‌సాగర్ నాబడు కేవల పురుషుడు, మియర్ మేలుడు మరణ వాంగ్మూలం ఇస్తున్నాడు. నథింగ్ మోర్ దెన్,

నో బెటర్ పురుషుడితడు. ఇతడు కేవల పురుషుడు. ఈ కేవలం ఇతను ఆశిస్తే సిద్ధించిన అర్థం కాదు. మాగ్జిమమ్ రిస్క్ అన్నప్పుడు, ఉన్నప్పుడూ మేల్ కొలుపులు పాడినప్పుడు ఒకలాగా ఉండి, ఇప్పుడిలా 'మియర్ మేల్' అంటూ దారి తప్పి పోయేందుకు ఒక శాబ్దిక సంకేతాన్నిస్తున్నాడు. ఇదంతా Phallocentric కవిత్వమని భ్రమలో పడేసి, కాళ్ల క్రింది రెడ్‌కార్పెట్ సర్రున లాగేసి మనమొక అనర్థంలో పడి పోతే - 'Poetry is a Social institution. It has complex affinities with other parts of our cultural existence' అని నిర్ధారిస్తున్నాడు టెరీఈగల్టన్ లాగా. ఇతనేమీ ప్రముఖ విమర్శకుడు కాదు. వొట్టి కవి. కుటుంబంలాగే కవిత్వాన్ని సామాజిక వ్యవస్థన్న వాడెవడూ లేడు. ఒక్క ఈగల్టన్ తప్ప. ఇతన్లాగా కవిత్వం రాసిన వాడె వడూ లేడు ఇతను తప్ప.

ప్రతికవీ మనిషిలా అద్వితీయుడే. ప్రతి కవితా కవిలా అద్వితీయమే. కాబట్టే ఈ కవి 'All language is originally poetry' అంటున్నాడు. 'Saying is showing' అని అనగలుగుతూ ఉన్నాడు. అంతేకాదు 'Saying is soul inaugurating a form' అని తన కవిత్వం ద్వారా నిరూపణ చేస్తున్నాడు. కవిత్వంలో దేనిని ప్రేమించడానికైనా ముందు పదాలను ప్రేమించాలని ఒక షరతు విధించాడు Wallace Stevens. శబ్దానికి ఉండే ప్రాధాన్యం అటువంటిది. శబ్ద సౌందర్యం అటువంటిది. పాఠకుడికి తొలిపరిచయం పదమే అది శబ్దించే అదేదో సవ్వడే. దానినే అర్థమంటాం. అవ గతం చేసుకుంటాం. సాగర్ ఈ సంపుటిలో 'తొక్కలో', తొక్కలోది అనే పదాలను అలవోకగా వాడాడు. ఇది Street idiom అదొక linguistic gesture. అందుకేనేమో 'The sound of the words is the first primitive pleasure in Poetry' అంటున్నారు. తొక్కలోది మన్ కవిత్వాన్ని లవ్వినా లవ్వకపోయినా ఈ పదాల్ని అమాంతంగా, అమాయకంగా, అమేయంగా, ప్రమేయం లేకుండా లవ్విపోగలడు అరుణ్‌సాగర్.

భాషంతా కవిత్వమే ఇతనికి. అది ఏ భాష అనే పట్టింపు లేదు. సాగర్ కవిత్వం చదివేటప్పుడు మీరు గమనించండి 'పడావుపడ్డ క్షేత్రం' లాంటి కవిత్వంలోకి వేటూరి పాటల్ని, తెలుగు హిందీ సినిమాల పాత, కొత్త పాటల మాటల్ని, పల్లవుల్ని, చరణాల్ని, జాక్సన్ గీతాల్ని అలా అలవోకగా ప్రయోగించి కవిత్వానికి ఒక వెలుతురును ప్రసాదిస్తాడు.

కవికి అద్వితీయత ఎక్కడ నుంచి వస్తుందనేది ఒక ప్రశ్న. అది తనదే అయిన Idiom వల్ల. Idiom is the medium. వ్యాసుడంతటి వాడ్ని కూడా పార్వతి చేత బెదిరింపజేస్తాడు శ్రీనాథుడు 'నుడికారముఁ దప్పకయుండఁ భారతంబెట్ట రచించితీవు' అని ఈ నుడికారం పట్టుబడకుండానే కవిత్వబడిబాట పట్టిన కవులు చాలా మంది డ్రాపవుట్స్‌గా మిగిలి కనిపిస్తారు తెలుగు కవిత్వంలో. తన Idiomని తాను ఆవిష్కరించుకోవడమే కాదు. ప్రతి సామాజిక సందర్భానికి కూడా ఒక Idiom ఉంటుంది. మనం ఇటీవలి కాలంలో విన్న కొన్ని పదాలను ఆలకించండి. 'జవాబుదారీతనం', 'విశ్వసనీయత', 'ఇందిరమ్మ ఇళ్లు, 'ఆరోగ్యశ్రీ', ఆకర్ష్, స్వగృహ, రాజా, 2జి. ఆదర్స్ ఇంకా ఇట్లాంటివే వీటిని పొలిటికల్లీ యువర్స్ పదాలంటారు. భాషాశాస్త్రం చదువుకోని భాషాశాస్త్రవేత్తలు ఒక్క రాజకీయ రంగంలోనే ఇన్నేసి నూత్న నుడికారాలు పుడుతుంటే అనేక రంగ సమాహారమైన సామాజిక జనజీవితాల్లోకి ఎన్నేసి పదాలో పుట్టుకొస్తాయి. అలా పుట్టుకొచ్చే పదాల్ని కవులు పట్టుకొస్తారు. 'పోయిటికల్లీ యువర్స్' అని చివర్న ఒక సంతకం పెడతారు. కవిత్వమెప్పుడు 'ఇడియోటిక్ట్' అరుణ్‌సాగర్‌లాంటి కవులకు విశ్వవీధుల, వినువీధుల, మార్కెట్ బాటల, విశ్వలయల, విలయ బాధల, విశాల జీవన కిక్కిరిసిన జీవన విధానాల నుడికారాలన్నీ వెనువెంటనే తెలిసిపోతుంటాయి కనుక ఆ సజీవ నుడికారాలను భద్రంగా పొదుగుతారు. ఇదొక సంవేదనాశీలతను కాపాడుకునే వ్యూహం.

ఇందులో ఆర్తనాదం ఉంటుంది. ఆర్ద్రనాదమూ ఉంటుంది. ఇదంతా కవిత్వానికి కావలసిన tonal effectని సాధించి పెడుతూ ఉంటుంది. ఆ toneని దాని తరంగ దైర్ఘ్యాన్ని విని తట్టుకోవాలే కాని తిట్టుకోకూడదు.

ఏమైనా కవిత్వ రింగ్‌టోన్ మార్చకపోతే కవి బ్రతకడు. మృతరూపకాల్నే పిండేస్తూ పోతే కవిత్వమూ బ్రతకదు. చాలానేక అసంఖ్యాక తెలుంగు, ఆంధ్ర, తెనుఁగు, తెలంగాణ కవులు ఈ మృతరూపకాలను (Dead Metaphors) పట్టుకుని కవితా కళేబరాలై వ్రేల్లాడి, మృతశిశువుల్ని నీళ్లాడి బాలింత స్నానాలు చేసి 'ఇకలేరు'లు అయ్యారు (అట్లాంటి వాళ్లలో నేనూ ఒకడ్ని) ఎవరో వాడేసిన వాక్యాన్ని కాక కవితా వాక్య నిర్మాణానికి పదాలెత్తిన, జెండాలెత్తిన కవులు మాత్రమే స్టామినా గల 'Poetic Stanza'లుగా మిగులుతుంటారు. ఈ బలవర్ధక కవిత్వం తాగితే పరవశుల్ పబ్ టచ్‌లోకి వెళతారు. కానీ, విషాదమేమంటే తెలుగు కవిత్వంలో ప్రయోగవాదం పట్ల అమితమైన అనవసర, అసహనమే వ్యక్తపరిచారు విమర్శకులు. సదరు విమర్శకులు కవిత్వం చేసే అద్భుతమైన పని ఒకటుందని విస్మరించారు. కవిత్వం భాషమీద 1975 లాంటి 2009-10 లాంటి ఒక ఆత్యయిక పరిస్థితిని విధిస్తుంది. కవులను కుట్రదారుల్ని చేసి రాజ్యం ముందు నిలబెడుతుంది. ఎప్పటికప్పుడు కవి కళ్లముందు ఒక Paradoxical Situation ఆవిష్కృతమవుతూ ఉంటుంది. నిశిత ఇంద్రియాలు గల కవులు ఆ Paradoxical realityని మోహించి బట్టబయలు చేస్తారు. సాగర్ కవిత్వంలో Paradox ఎక్కడెక్కడ సర్వాంతర్యామిత్వాన్ని సంతరించుకుని ఉందో పాఠకులు గ్రహిస్తారు.

నిజానికో అబద్ధానికో అసంబద్ధానికో మనమంతా అదేదో పతంజలి చెప్పినట్లు చిత్త వృత్తులన్నీ నిరోధించుకుని ప్రపంచీకరణంలో ధనయోగస్థితిలోకి నిష్క్రమించాం.

ఎవరి జీవిత శిఖరాల్ని వాళ్ళే అధిరోహించి టెన్జింగ్ నార్కేలుగా ప్రకటించుకున్నారు. ప్రతి ఒక్కరూ తమని తామూ సెలబ్రిటీస్‌గా గుర్తించేసుకున్నారు. ఒకానొక అలౌకిక, ఆధ్యాత్మిక సనాతనానందాన్ని అనుభవిస్తున్నచోట మన జీవన విధానమంతా, సాంస్కృతిక వైవిధ్యమంతా ఒకే రకపు తోలుబొమ్మలొకేవైపు ఒకే నడకగా మారాక, మన సామాజిక రాజకీయ దృక్పథాలు మారాకువేయకుండా నిలకడస్థితికి వచ్చేశాక ఈ జీవితం స్టేలైపోయిన కవితా వాక్యంగా మారాక, నాయనా కవిత్వం ఇలా క్కాదురా అలాగా కూడా కాదురా నాలాగా ఉండాలి, నా వాక్యంలా ఉండాలని అనీ అనకుండా సమస్తానంత దృగ్విషయాలను ఒకే పర్యాంతాల కలాజ్ చేసి పరచిన ఈ చిరుపొత్తాన్ని హృదయాల ముందు హృదయంతో వినయపూర్వకంగా, ధిక్కార సహితంగా గిరాటేస్తున్నాడు. నిరంతరం చూస్తూనే ఉండకండి. కాస్త చదివి పెట్టండి.

# 2

ఎందుకంటే-

కవి, పాఠకుడికి రాసిన రహస్య ఉత్తరమే కవిత్వం. దాన్లోని రహస్యం ఎవరికి వారికే ప్రత్యేకమైంది. ఏ పాఠకుడూ మరొకరికి తాను తెలుసుకున్నది ఇదీ అని నిర్ధారించడు. పాఠకుడిగా కవి రాసిన కవిత్వం చదువుతున్నామంటే, ఇతరుల ఉత్తరాన్ని కాదు నువు చదివేది. అందులో సందేశం దానిని వెతుక్కున్న వాడికి అందుతుంది లేదా అది అందిన వాడికి దొరుకుతుంది. ప్రతి పాఠకుడూ కవితకు తానొక రహస్య చిరునామాదారుడేనని రష్యన్ కవి ఒసిప్ మాండెల్‌స్టామ్ వాక్యా

లుగా హౌ టు రీడ్ ఎ పోయెం అండ్ ఫాల్ ఇన్ లవ్ విత్ పోయెట్రీలో ఎడ్వర్డ్ హిర్ష్ ఉదాహరించాడు. సముద్రం మీద ప్రయాణించేవాడు, ప్రయాణం ప్రమాదంలో పడ్డప్పుడు తన నిధి గురించి తాము ఇతరులకు ఒక సమాచారం తెలియజేయాలనుకున్నప్పుడు, చెప్పాల్సినదేదో ఆ పెనుప్రమాదపు ఘడియల్లో తొందర తొందరగా రాసేసి కాయితంలో చుట్టచుట్టి సీసాలో బంధించి సముద్రంలోకి విసిరేస్తాడు. అది ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరికి సముద్రపొడ్డున ఇసుకలో కూరుకుపోయి దొరుకుతుంది. కవి కూడా సమాజ సాగరం మీది వర్తకుడే ప్రతి అడుగూ ప్రతి పరిణామమూ, ప్రతిమార్పు పెనుప్రమాదపు అంచులను తలపింపజేస్తుంటుంది. ఆ ప్రమాదం నుంచి తానెలా బయటపడాలా అని కాక, ఈ సమాజానికి పొంచి ఉన్న ముప్పును, ముంపును ముందే గుర్తించి సీసాల మీద సీసాలను అలల తలల మీద ఒదిలేస్తాడు. అందులో రహస్య ఉత్తరమే ఉంటుంది. అందులోనే ప్రతి నోటికీ ఉన్న నుడికారం ఉంటుంది. ప్రతి మందకూ ఉండే నోరుంటుంది. ప్రతి నాలుకా ఒక సమూహాన్ని మాట్లాడ్తుంది. తనలోంచి తనలోకే ప్రవహించిన, తనని తాకిన సాంస్కృతిక పోకడలు, తన కాలంనాటి జీవన విధానాలన్నీ ఉంటాయి. సాగర్‌ది వర్తమాన life style oriented poetry అందాం కాసేపు. పోనీ ఇది కాదనుకుంటే మెట్రో కవి రెట్రో వేదన అందాం. అయితే నేనేమీ నిర్ధారించడం లేదు. అరుణ్‌సాగర్‌ను ఏదో ఒక కట్టుగొయ్యకు తగిలించడం లేదు. తానెలాగా భాషాపరమైన భావభంగిమలను పదాలుగా, పదబంధాలుగా, మెటఫర్లుగా, సిమిలీలుగా, ఇమేజ్‌లుగా అట్లా మెట్టచేలో శనగలు ఎదబెట్టినట్లు ఈ భాషని విత్తుతున్నాడు. కవిత్వపంట పాఠకుడి హృదయక్షేత్రంలో రాలడానికి. ఎంత చదివితే అంతే రాల్తుంది. ‘Mere Air, these words, but Delicious to Hear’ అనుకుందాం. అయితే పాఠకుడిగా నా అర్థం మీద మీరు ఆధారపడకండి.

మొట్టమొదట కవి భాషరి (కుమ్మరి, కమ్మరి, జాలరిలాగా) లాంగ్వేజ్ వర్కర్ అట. తయారీదారుడట. రూపొందించువాడట. భాషను మలిచేవాడుట. కవిత్వ భాషను మరిచిపోని వాడట. అయితేనేం అనేకమంది సబ్‌స్క్రైబ్ చేస్తున్నదేమిటంటే 'Language is an impure medium. Speech is public property and words are the soiled products, not of nature, but of Society, Which circulates and uses them for a thousand different ends' లక్షోపలక్షల లక్ష్యాలను లక్షించి సామాన్య, జన సామాన్య భాషను మృదువుగా పట్టుకుని కోడిగుడ్లమీద 21 రోజులు రెక్కల వేడితో పొదిగి పిల్లలను వెలికితీసినట్లు కవులు గుండెల్లో పదాలు పొదిగించి భావాలను వాక్యాల్లో వొదిగించి మరీ కంటారు కవిత్వపు కోడి పిల్లల్ని. వీటిల్లో కొన్ని మాత్రమే పందెపు కోళ్లయి కాళ్లకు కత్తులు కట్టుకుని కన్నీళ్లూ, రక్తమూ వోడుతూ పోరాడ తాయి పాఠకులతో. కవిలాగే పాఠకుడూ గాయపడతాడు. పాఠకుడిని గేయంగా మార్చే ఇంద్రజాలమే కవిత్వం. అందుకే కవిత్వాన్ని మాత్రమే కలవరించిన శ్రీ. శ్రీ 'కవిరాసేది సగం జీవితం. మిగతాది పాఠకుడు' అన్నాడు. కావాలంటే ఈ కవిత చూడండి.

**(మరణ వాంగ్మూలం)**

'పాయం బొజ్జిగాడు
లాస్ట్ ఆఫ్ ది కోయాస్
పెరిగి పెద్దయి
అలెక్స్ హేలీ అవుతాడా
ఆనకట్ట వెనుక అశ్రుజలధిలో
సీతమ్మ ముక్కు పుడక వెతుకుతాడా

లేక
అంతర్ధానపు అంచున వేలాడి
రామా పితికస్ వలె
ఆంత్రోపాలజీ పాఠమవుతాడా'

క్షణక్షణమూ చెరిగిపోతూన్న 'మునిగిపోయిన మానవుని జాడలు' వెతుకుతున్నాడీకవి. చివరకు మిగలని దానిగురించి చెపుతున్నాడు. ప్రతిదీ తొలగించబడుతుంది రెవెన్యూ రికార్డుల్లోంచి. అందుకేనేమో ఈ కవిత్వమోహి, ఈ కాలపు వ్యామోహి ఈనాటి జనసంవేదనల పట్ల కడు జాగరూకుడై, మిక్కిలి అజాగ్రత్తగా భాషని, వొట్టిభాషని కవిత్వం చేసి పెడుతున్నాడని ఇందాక అనుకున్నాం కదా! భాష స్వభావతః చెడ్డది కాదని, దానిని సమాజమే కలుషితం చేసిందని, కలుషిత భాష అకలుషితం కావాలంటే అది కవిత్వానికెక్కాలి. సాగర్ ఆ పనిని యధేచ్ఛగా చేస్తున్నాడు.

అరుణ్‌సాగర్ కవిత్వంలో వస్తు-రూపాలు ఈ ఏడాది వచ్చిన మొహర్రం-ముక్కోటి ఏకాదశిలాగా కలగలిసిపోతాయి. ఈ రెండిట్నీ ఒక ప్రేమికుడికి, ప్రేమికకు పుట్టిన Identical twins అందాం. ప్రసేన్ అయితే కవలలు అనకుండా త్రివలలు అంటాడు. ఈ మూడోదేమిటంటే కవి దృక్పథం అని జవాబు ఇచ్చుకోవచ్చు. వస్తు, రూపాల మధ్య ఎప్పుడూ ఒక tension ఉంటుంది. ఇది పోలీసులకూ ఉద్యమకారులకూ మధ్య ఉండే tension లాంటిదే. వీటిమధ్య ఒక సామరస్యం పొసగించడమే కవి చేయాల్సిన పని. నిజానికి సాగర్ కవిత్వంలో కనిపించేది వస్తు వైవిధ్యమో, రూపవైవిధ్యమో కాదు. అది అనుభవ సందర్భ వైవిధ్యం. భిన్న అనుభవ సందర్భాలను ఛిన్నాభిన్నంగా మాట్లాడేస్తాడు కవి. కవిత్వంలో వస్తువు రూపానికి

సాకుమాత్రమే. అయితే వస్తునిష్ఠ కవులు, రూపశ్రద్ధ కవులని రెండు రకాల కవులుంటారు ఏ భాషా కవిత్వంలోనైనా. ఈ రూపశ్రద్ధ కవులకు వస్తువు అనుభవమే. బహుశా త్రిపుర తన కవితా సంపుటికి బాధలూ - సందర్భాలూ అని పేరు పెట్టింది ఇందుకేనేమో!

# 3

వస్తురూపాల పాత చర్చ మళ్లీ ఎందుకు? అరుణ్‌సాగర్ కవిత్వంలో కనిపించే అంతర్వాచకాల మాటేమిటి? అనే సందేహం కలుగుతుంది ఎవరికైనా. వాచకం, అంతర్వాచకం అనే మాటలు ఒక అర్థానికే పరిమితం కావు. మనమెల్లప్పుడు కవిత్వానికి అర్థమేమిటని, ఈ కవిత్వంలో అర్థమేంటని అడుగుతూ ఉంటాం. కానీ, ఏ వాచకానికైనా ఇదే అర్థమని ఎవరూ చెప్పరు. అసలు రచనను భిన్న నిర్వచనాలతో కొలత వేస్తున్నప్పుడు. టెరిడా దృష్టిలో అర్థం అంటే, 'explosion, a dissemination' అంతకు ముందే ఏర్పడి ఉన్న అర్థాన్ని అటు ప్రవాహ సదృశంగా ఇస్తూ పోతుంది. ఏ ఒక్క పదమూ ఏకార్థబోధకం కాదు. ఏ సంకేతమూ అర్థాన్ని స్థిరపరచదు. నిశ్చయంగా చెప్పదు. ఎందుకంటే ఇది ఏకవాచకం కాదు. బహుళ వాచకం.

'మేల్ కొలుపు'లో సాగర్ ' ... ఎవడైతేనేం మగాడొక ఒంటరి పర్వతం. ఒంటరి చెట్టు. ఒంటరి ద్వీపం. ఒంటరి గీతం' అని ఏకత్వాన్ని భజించాడు. ఇది మగవాద

కవిత్వమా? స్త్రీవాద వ్యతిరేక కవిత్వమా? అనే సందేహమూ రావచ్చు. ఇప్పుడు 'మియర్ మేల్' పోయెమ్స్ ఫర్ మెన్ ఇన్ తెలుగు అని అంటున్నాడు కదా! తాను ప్రతిపాదించిన మగవాద కవిత్వానికిది కొనసాగింపా అనే శంకా కలుగుతుంది. శంకా నివృత్తికి 'సెంట్ ఆఫ్ ఎ ఉమన్' కవిత చదివి ఊరుకోండి. కనీసం ఈ పంక్తులతోనైనా సరిపెట్టుకోండి:

ఒడిలో పసికందు
కళ్లలో స్థితహాసం
కృతజ్ఞ రేఖ
సౌందర్యం
"చివరకు కదా తెలిసింది
నిన్ను ప్రేమిస్తున్నానని"

అన్నప్పుడు, ఎలియన్ కాదురా - ఇలియానా అంటున్నప్పుడు, 'భద్రజీవన బంధము'ను ప్రశ్నార్థకం చేసినప్పుడు, రెండు దేహాల జాడలు నందికొండ వాగుల్లోనో, నల్లతుమ్మల నీడల్లోనో తేలీ తేలనప్పుడు, పాటలు చారిత్రక ఆధారాలుగా మారినప్పుడు, 'పుట్టు, పెరుగు, పెళ్లాడు, పిల్లల్ని కను. మరెప్పుడు ప్రేమ' అని పునః పునః ప్రశ్నించేటప్పుడు ఈ కాదలన్ 'ఉద్వృత్తాంగాజోన్మాదుడై'న ఆ కీచకుడిలాగా

"వామాక్షి రుచిర లావణ్యంబు భావించు‹
ధన్వంగి రూపు చిత్తమున నిలుపు
గంబుకంధర చెన్ను కైవడి తలపోయు
నంగన సౌకుమార్యము‹దలంచు

భామిని సహజ విభ్రమ మెదఁగీలించుఁ
బడఁతి చెయ్యుట మదిఁబట్టు కొలుపు
మానిని గరువంపు మాట పొందూహించు
దళితాబ్జముఖి తిన్నఁదనము మెచ్చు,
నడరి కోర్కులు చిఱ్ఱుముఱ్ఱాడ వెడఁగు
పడిన యుల్లంబు పట్టున బఱుపదనకు
వశముగాకున్న నెంతయు పంతఁపొందుఁ
జింతయెసకంబు వడిగొని చిక్కువఱుప''

(చూడుడు: కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - విరాటపర్వము తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి ప్రచురణ; 2006)

# 4

పరిపరి విధాల వామాక్షుల గురించి వివిధ అవస్థలలో, వివిధ చిత్తవృత్తులతో కవనకీర్తింపును వినండి సాగర్ కవిత్వంలో. కవిలాగే కీచకుడు కూడా మియర్ మేలుడు. 'లవ్ ఆజ్ కల్' కనుడు. నా జీవితమంతా నీ వెక్కడుంటివే అందాల రాక్షసీ అంటున్న సాగర ప్రేమను స్వూన్లతో కొలవండి. పిచ్చిగడ్డి మాటున కసుక్కున హృదయానికి దిగిన పాతికేళ్ల గాజుముక్కను ఆరాధించండి.

అంతే తప్ప ఫెమినిజమని యాంటీ ఫెమినిజమని సిద్ధాంతీకరించారో సమద్ బెహరంఫీ నల్లచేపపిల్ల వలె తటాలున తటాకం దాటేసి పోతాడితడు. అయితే

మాత్రం కొన్ని నిర్మాణాలను అవి సామాజికమైనా, జైవికమైనా పనిగట్టుకుని కూల్చేందుకు మాత్రం వెనుకడుగు వేయడు.

అంతదాకా ఈ ఆత్మదేహ నాదాన్ని Visceral Cry అందాం. ఇరోటిక్ పొయెట్రీ అందాం. వీటిని సోషియో బయాలాజికల్ పోయెమ్స్ అందాం. ఏదో ఒకటి అనకుండా ఎలా ఉండగలం? ఇంత చదివాక. కానీ చేయాల్సిందేమిటంటే Genes, Mind and Cultureలో సోషియో బయాలజిస్టు ఎడ్వర్డ్ విల్సన్, mindను a link between biology and culture' అన్నాట్ట. మరి సాగరేమో ఒకే ఒక్క క్లూ ఇచ్చాడు 'టెస్టోస్టిరాన్' అని. జైవిక మూలాలకు, సామాజిక ప్రవర్తనకు ఒక ప్రధాన లంకె ఈ టెస్టోస్టిరాన్. కానీ మన బుర్రలు అనుభవాలను వడకట్టి ప్రవర్తనను నియంత్రిస్తుంటాయి అనుదిన అనుభవాలకు జైవిక అవసరాలకు మధ్య శాంతి, సుస్థిరతలను ప్రసాదిస్తుంటాయి. చివరికి ఫిజిసిస్టు Michio Kaku మాటలతో ముగిద్దాం. 'our brains are identical to the ones which emerged from Africa 1,00,000 years ago. You take a cave man, Shave him, give him a 3-piece suit, and put him on wall st, and he looks like all the other barbarians on wall st. Our brains haven't changed at all in the last 1,00,000 years. The only difference is that these cave men now have nuclear weapons.'

(quoted by James Mc Bride DABBS in Heroes Rogues and lovers testosterone and Behaviour)

25 డిసెంబర్ (అజంతా వర్ధంతి)
2010

**-సీతారాం**
S/o మాణిక్యం



# అన్నవాక్యం

అనగనగా ఒక కవి... ఆధునికానంతర గ్రహాంతర ఆటవిక ప్రేమికుడు. కోట్ల పూలరేకు పాదాల త్రొక్కిసలాటలో నలిగిపోతున్న కాలాతీత స్థలాతీత స్వాప్నికుడు. ఛిద్రమవుతున్న గుండెను తీసి పళ్ళెంలో పెట్టి రొటీన్‌గా పూజకు సిద్ధమయ్యే అక్షర రాక్షసి ఆరాధకుడు. ఎటు చూస్తే అటు రంగులు... కళ్ళూ ఒళ్ళూ జిగేల్‌మంటుంటే నాడీమండలంలో బద్దలవుతున్న ఆర్డీయక్స్ శబ్దసమ్మోహన సంగీతంలో వివశుడై పరవశుడై ఒక పురావేదనలో పరితపిస్తున్న క్షతగాత్రుడు.

ఎవడు వీడు.. వలయాలు వలయాలుగా తనలోకి లాక్కుంటున్న నవీన జీవన ఆక్టోపస్ సుందరి మీద పగబట్టి కత్తికట్టిన అసహాయ శూరుడు! ఎవడ్రా వీడు... మన బతుకు నిదరలో కలత రొద!

లవ్ ఆజ్ కల్ కా అజ్‌కల్ నమూనా.
దునియా భర్ కా లవ్ లేనే వాలా.
డు యూ హ్యావిట్ ఫర్ హిమ్?

గోడలేవో నిర్మించుకొని ఎగబాకుతూ దిగబాకుతూ తంటాలుపడే వాళ్ళకి గోడలు కూల్చడమే తెలిసిన వీడు ససేమిరా అర్థంకాడు. కవిత్వమంటే ఇలాగే ఉండాలని కట్టు బాట్లేవో ఉన్నవాళ్ళకి... నిబంధనల కట్టుబట్టలన్నీ ఊడబెరికి పచ్చిపచ్చిగా పలవరించే ఈ పిచ్చి పోరగాడు అసలు ఒంటబట్టడు. వస్తుశిల్పాల వంపుసొంపుల కొలమానాలకు పంగ నామాలు పెట్టి పకాలున నవ్వడమే తెలిసిన ఈ కవి... విమర్శకాగ్రేసర చక్రవర్తులకు ఎంతమాత్రం అంతుచిక్కడు. సంప్రదాయ సంభోగ పిపాసులకు ఇతని సాక్షరరతి రహస్యం బోధపడదు.

ఓన్లీ ఫర్ మెన్ అంటాడు కానీ.. అంతా విమెన్ పలవరింతే.

అనాదిగా మగవాడు స్త్రీకోసం చేస్తున్న ఆదిమధ్యాంతర రహిత అనంత ప్రార్థనలా ఉంటుంది తమ్ముడి కవిత్వం. వామపక్షమో భామపక్షమో పోల్చుకోలేక మనం తబ్బిబ్బు పడతాం కాని ఇతని అక్షరాలకు మాత్రం ఏ వలపక్షం తెలియదు. అంతా బోయవాడి బాణం దెబ్బకు విలవిల్లాడిన పక్షి రోదనే. అతని అక్షరాల్లోకి ధైర్యంగా అడుగుపెట్టే దమ్ముండాలి కాని షడ్రుచుల అశ్రుస్పర్శ తగిలి విస్మయులమై.. తన్మయులమై.. రసానందస్వాములమైపోతాం.

ఆదియందు వాక్యమున్నదా! ఆ వాక్యమే కవిత్వమైనదా! ఇప్పుడది ఏ రూపంలో ఉంది? ఏమో! తమ్ముడు మాత్రం దగ్ధమవుతూ భస్మమవుతూ ఫీనిక్స్‌కి రీమిక్స్‌లా నవ్వి పోదురుగాక అంటూ పొగరుపోతాడు. అప్పుడప్పుడు ఈజిప్టు రాణిని లేపుకు పోయేందుకే పుట్టిన జాక్సన్‌లా ఒళ్ళంతా ధిక్కారంతో ఊగిపోతాడు. అందీ అందని వందలాది రేఖలకోసం అమితాబ్‌లా దేఖా ఏక్ ఖ్వాబ్‌తో ఏ సిల్‌సిలా హుయే అనుకుంటూ దుఃఖిస్తాడు. చుట్టూ గాంధార శిల్పాలు... సాలభంజికలు... ఏ కహాఁ ఆగయే హం అనుకుంటూ కవిత్వానికి భాషతో పనేముందనుకుంటూ మౌనమే నీ భాష అని పాడుకుంటూ పాటలో సంగమించి తన చుట్టూ తానే నిప్పంటించు కొని హవేలీకి నిప్పుపెట్టిన దేవదాసులా కసిదీరా వికటాట్టహాసం చేస్తాడు.

మనకు అంతకు మునుపెప్పుడూ తెలియని ఏదో సంగీత మార్మికధ్వని ప్రతివాక్యంలో ప్రతిపదంలో అక్షరాక్షరంలో వినిపిస్తుంది. కళ్ళతో చదువుతూ ఉంటే చెవులతోనో.. హృదయంతోనో వింటూ ఉన్నట్టు ఒక అనుభవం మన పక్కన కూర్చుని మన భుజంమీద తలవాల్చుతుంది. జలపాతం కింద నుంచున్నట్టు... ఒక పూలచెట్టు మీద కూర్చొని ఎటో ఎగిరిపోతున్నట్టు... ఆకాశంలో వెన్నెల బంతితో ఆడుకుంటున్నట్టు... సూర్యుడి ముందు నిలబడి తుంటరిలా ఒంటేలు పోసుకుంటున్నట్టు... ఏవేవో అనిదంపూర్వ అనుభూతులు... ఎవరీ జీవుడు... ఏమిటితని దేవులాట... ఎందుకీ వేదన... ప్రశ్నలేవో ఉదయిస్తాయి. పైకి కనిపించని ఆవేదన... దుఃఖం... కన్నీళ్ళు... ఈ కవిత్వం చదివాక మనల్ని వెంటాడక తప్పదు. జీతం ఫ్రేములో అతకని జీవితం పగటిరాటకు కట్టిన మోకుతాళ్ళను తెంచుకుని మిగిలిన కొంచెం రాత్రిని కౌగిలించుకుని ఏడుస్తున్న దృశ్యమేదో తరుముతుంది. కార్పొరేట్ కవ్వింపుల వగలాడి కనుసైగ పద్మవ్యూహంలో ఓడుతూ పడుతూ పోరాడుతున్న రసిక సైనికుడి రక్తాలాపన ప్రేలాపన. రాసిందానికంటే ఇతనిలో ఇంకిపోయిన కోటి సముద్రాల ఘోష ఏదో మనల్ని మెలకువలోనూ నిదరలోనూ హింసిస్తుంది.


గోడలమీద రాత్రిసూర్యులై ఉదయించిన ఇతని చేలాగాళ్ళంతా మనకెక్కడో ఏ పురావీధుల్లోనో తగులుతారు. మనతో ఆడుకుంటారు. ఏ పోలికలూ అవసరంలేని స్నేహపు మోహంలో తడిసిపోతాం. ఎవరి ఊరిని వాళ్ళు.. ఎవరి పాతింటిని వాళ్ళు చూసుకున్నప్పుడు సాగర్ అనబడే ఒక ఎలెక్స్ హెలీ హోంకమింగ్ గుర్తుకొచ్చి... కాలాలు దాటి మానవుడు తనను తాను వెతుక్కుంటున్న అడుగుల చప్పుడు వినిపిస్తుంది. చల్లారని స్మృతులు... చల్లారని చితులు... గోరీల కింద పలకరిస్తున్న కంకాళాలు... ఇంతలోనే జీవితం ఇంతపని చేసిందా అని గుండెకూ గొంతుకూ మధ్య పేరుకుపోయిన రూపాయి గాడీల గాజుకళ్ళలో స్నేహితుల రంగురంగుల నీడలు. జేగురురంగు జ్ఞాపకాలు... సీలేరునది ఒడ్డున విల్లంబుల

నిశ్శబ్ద ధ్యానం ధ్వానం. నల్‌దిక్కుల్ గాజుతెరల్... చుటుముట్టిన ఫ్రేముల్... తట్టుకోలేం. దృశ్యాలు... దుఃఖపాతాలు సన్నివేశాలు... చలనసూత్రాలు... భరించలేం. డెడ్‌లైన్సే లైఫ్‌లైన్స్ అయిన చోట ఇంటి దగ్గర ఒక మల్లెపూదండ... ఓ బంగారుకొండ గుర్తుకొస్తున్నా అక్కున చేర్చుకోలేని అనివార్య అసహాయ ఆక్రందన ఇదంతా. నిద్రపట్టని రాత్రులు... రగిలే అస్తిత్వ పోరాటాలు... మంచంకింద జిల్లేడు పొదలు... సెరిబ్రెల్ గోడల్లో గోడుగోడున కాలర్ ట్యూన్ ఘోషలు... అశాంత సమీరాలు... అలజడీ ఆందోళనా అందరిదీ అంటున్న ఆవేశం. రెక్కలున్నా మనది కాని ఈ ఆకాశంలో ఎక్కడికీ ఎగరలేమంటూ హెచ్చరికలు.. సహించగలిగే సాహసం ఉన్నవాడే ఈ హిమసముద్రంలోకి నగ్నంగా దూకాలి. వీడు మారడురా అని కచ్చితంగా అనుకోవాలి. బహుశా మనం మారక తప్పదని ఒప్పుకొని తీరాలి. వీడు అర్థంకాడురా అని తిట్టుకోవాలి. అర్థమైతే తట్టుకోలేమని చివరాఖరికి చచ్చినట్టు సరిపెట్టుకోవాలి. ఏమిటీ ఇంగ్లీషు నాన్‌సెన్స్... ఇంట్లో పిల్లల్ని ఇంగ్లీషులో మాట్లాడకపోతే దండిస్తూనే బయట మాతృభాషకోసం ఉపన్యాసాలు దంచేవారు... అయ్యా దయచేసి మీరు ఇటువైపు రావద్దు... ఇక్కడ గ్లోబలైజ్డ్ గోళీకాయాట గోల్‌మాల్ వాస్తవాలున్నాయి జాగ్రత్త.

దాపరికాలు... దాగుడుమూతలు... నక్కవినయాలు... బేవార్స్ వాక్యాలు ఇక్కడ మచ్చుకు కూడా కనపడవు. తెచ్చిపెట్టుకున్న ఏడుపులు... మొప్పుకోలు పడిగాపులు... మర్యాద మప్పితాలకోసం కుస్తీలు... గస్తీలు ఇక్కడ కానరావు. అంతా ఓపెన్. ఒక ఆదిమ మగపాపి నిజాయితీ నిరహంకార నిర్వేదమే ఎటు చూసినా. ఇప్పటిదాకా ఇతనిలోకి దిగని వారు ఇకనైనా ధైర్యం చేస్తే కచ్చితంగా వేర్ వర్ యూ ఆల్ మై లైఫ్ అని ఈ కవిని కౌగలించుకుని కన్నీరు మున్నీరు అవుతారేమో. అసూయగా ఉందిరా తమ్ముడూ! అయినా తమ్ముడు తమ్ముడే... కవిత్వం కవిత్వమే.

**-ప్రసాదమూర్తి**

# బిట్వీన్ అజ్




**టూ** ఓపెన్ అప్! కొంచెం ఎనర్జీ డ్రింక్! బూస్ట్ కాదు కానీ ఇంతకంటే మొరెల్‌ను, స్ట్రెంగ్త్‌ను బూస్ట్‌చేసి స్ట్రెస్ రిలీజ్ చేసే పెయిన్ రిలీవర్ ఏముంటుంది? బాధపడుతూ కోప్పడుతూ లేదా ప్రేమిస్తూ అభిశంసిస్తూ - సీతారాం చెప్పినట్టు ఒకే కామన్ ఉత్తరంలో ఒక్కొక్కరికీ విడివిడిగా - వారితో కనెక్టయి వారితోనే కనెక్టయినట్టుగా వేర్వేరు వ్యక్తులతో ఒకే కంటెంట్ వాహకంగా వేర్వేరు రకాలుగా సంభాషించడమే ఈ ఎక్సర్‌సైజ్.

ఇక్కడేదో తిరగరాసి, ఇరగదీద్దామనైతే కాదన్నయ్యా - జస్ట్ నాలాంటి వారు ఎక్కడెక్కడున్నారో వెతికే సోషల్ నెట్‌వర్కింగ్. సమ్ లుక్ ఎట్ ఇట్ యాజ్ ఓన్లీ కదిలేదీ కదిలించేదీ - అయుండొచ్చు. భూగోళం బద్దలై ఉండొచ్చు. వర్గపోరు నానా నరవర్గాలను ఏకతాటిపై నడిపుండొచ్చు. నేనూ అలానే కదిలుండొచ్చు. కానీ, అగోచర సమూహ మస్తిష్కమొకటి అంతర్జాలాన్ని మించిన అదృశ్య తరంగాలతో నిర్మితమై అపరిచితుల మధ్య అత్యంత పరిచయమైన భావాన్ని ప్రసరించడం కూడా కదా ఇది.

ఒక వర్ణ చిత్రాన్ని గీస్తున్నట్టే అర్ధరాత్రి గోడమీద దొంగతనంగా గ్రాఫిటీ పూయించి పారిపోయినట్టే ఎక్కడో ఒక జ్ఞాపకాన్ని, అనుభవాన్ని, గాయాన్ని, నిశ్చయాన్ని ప్రయోగించి ఆవరణంలో ప్రవేశపెట్టడమే.

ఒక పాటని ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్‌లో మేఘాలూ లోయలూ కొండలూ సముద్రాల మధ్య రోలర్ కోస్టర్ విహారం చేయించడమే.

ఎక్కడో నువ్వు
ఎక్కడో నేను
మనిద్దరి మధ్యా కవిత్వం
ప్రియతమా ఇది నా కవిత్వం.

**-అరుణ్‌సాగర్**




# భ్రమరమోహం

రహదారి నిండా
రసపుష్పలావికలు
మలుపు మలుపులో
మాటువేసిన
నవరాగమాలికలు
-గో ఆన్!
లెక్కలేనన్ని ఆశ్చర్యాలు

దారిపొడవునా
మరీచికల వేట
తీరనిదాహం
విస్మయపథం
-వేరీజ్ హొరైజెన్!


దారి వెంబడి
పరిచయపత్రాల స్వీకరణ
నది ఎదపై
అంతర్చిత్రాల అన్వేషణ
-వాక్ ఆన్ ద స్కైలైన్!



చెట్లు చేమల్ కొండల్ గుట్టల్
ఓడిపోయిన పరుగుపందెం
బాల్యం చెక్కిన చిత్రం
బస్సు కిటికీలో భద్రం
గిరగిరాం బైరాగీ
చెప్పులే లేని దిమ్మరీ
-పాదాలు మట్టిలో ముంచి!

ఏమరుపాటున రాలిపడే
ఏ సౌందర్యం కోసమో
కళ్లు అరచేతుల్లో అద్దుకుని
శిశిరాకాశం కింద
అనుమానాస్పదంగా సంచరిద్దాం

తప్పిపోయి ఒకసారి
పారిపోయి ఒకసారి
కాస్తంత కవిసమయం కోసం
రాకుమారా!
-విజయం చేద్దాం





# హోమ్‌కమింగ్

నేను పరిచయమే
ఈ ఇంటికీ మింటికీ
ఇంటి కిటికీలకు
కిటికీలోంచి
కళ్లలోకి ధారలుపోయిన
తారలకూ
చందమామకూ
చందమామలోని కుందేలుకూ
కుందేలు వంటి తెలిమబ్బుకూ
నేను పరిచయమే


చిన్నప్పటి ఫొటోని
గుండెకు తగిలించుకున్న మట్టిగోడ
నా కోసం వానలో తడిసి
పరిమళాలు పోయింది
వంగిపోయిన చూరు నుంచి

రాలిపడ్డ నీటిచుక్క
నుదుట ప్రేమగా ముద్దుపెట్టింది
ఈ వరండాలో వీచే గాలులు
నా అమూర్త జాడలే

పెరటి పూల మహాసభ
ప్రత్యక్ష ప్రసారంలో విస్తరించిన
పుప్పొడిలోని స్వప్నాలు
నా పూర్వజన్మ వృత్తాంతాలే

నేను పరిచయమే
ఈ ఊరికీ వీధికీ
సోడా బిల్లేడు దెబ్బకి
పెచ్చులూడిన గోడకూ
గోడమీద కూలిన వేపమోడుకూ
వేపమోడుకు మొలకవేసిన
కొత్త చివురుకూ
నేను పరిచయమే

అందుకే కదా
నేను వచ్చానో లేనో




టేకుచెట్టు
పూలగుచ్ఛంతో నవ్వింది
ఓ పాట పింఛం విప్పింది

ఇద్దరు చేలాగాళ్ళు కలిసి
పాడుకున్న పాట
విప్పపూల సారాగా మారి
మత్తులో ముంచేసింది


రెండు గొంతులు కలిసి
మైమరచిన చోట
ఓ పూలదండ మెరిసింది
సాకీ ప్రవాహంలో
ఆకాశం సేదతీరింది

ఒక అనుభవం
పరవశం చెందింది
దానికీ
నేను పరిచయమే!






# ది డోర్స్




తెరుచుకో సిమ్‌సిమ్
కోటగుమ్మంలా తెరుచుకో
దుర్గమదుర్గాలు
అభేద్యకందకద్వారాలు
నా లోలోపటి రహస్యకుహరాలు
మర్మపేటికలు!
-గుండె తలుపులు తెరుచుకో సిమ్‌సిమ్

నేనిక అంతరిక్షనౌకనై
అంతరాంతరాళ
పాతాళలోకపుటాకాశంలో
గ్రావిటీని ధిక్కరించి

-సూపర్‌మేన్ రిటర్న్స్!
తెరుచుకో సిమ్‌సిమ్ బార్లా తెరుచుకో

నాలోకి నేను
పరిగెత్తుకు వస్తున్నాను
పారిపోయి వస్తున్నాను
వెతుక్కుంటూ వస్తున్నాను
రక్తమోడుతూ వస్తున్నాను


కుటుంబం నుంచి
కార్యాలయం నుంచి
రక్తపాశాల నుంచి
ఆడవాళ్ల నుంచి
అడుక్కుతినే వాళ్ల నుంచి
మొబైల్‌ఫోన్ నుంచి
గడియారంలోంచి
ఏటియం మెషీన్‌లోంచి
గోడలు దూకి దూసుకు వస్తున్నాను
కమ్మరి కార్ఖానాలో ఆగి
కాళ్ల గొలుసులు పగలగొట్టుకున్న ఖైదీలా
శక్తినంతా కూడదీసుకు వస్తున్నాను



తెరుచుకోరా సిమ్‌సిమ్
నీకే చెప్పేది
బెన్‌జాన్సన్‌కు దారివ్వుబే
లేకుంటే
జిమ్‌మోరిసన్ వస్తాడు
దిక్కులు పిక్కటిల్లే
పాటొకటి పాడతాడు
ఆ ఎకో ప్రకంపనాలకి
మీ కిటికీ తలుపులు ఆకాశంలోకి ఎగిరిపోతాయి
మీ ఇంటిగుమ్మాలు తునాతునకలై పేలిపోతాయి
మీ శరీరాలు మాంసఖండాలై చెల్లాచెదురైపోతాయి

కేర్‌ఫుల్!
తలుపులు తెరచుకుని బయటకి వస్తున్నాను
చేతులు సాచి ఆహ్వానిస్తున్నాను

నా గదికి గోడలే లేవు
బార్లా తెరచివున్న తలుపులు తప్ప
ఖుల్జా సిమ్‌సిమ్
ఖులా ఆస్మాన్!





# గ్రేట్ ఎక్స్‌పెక్టేషన్స్


(ఇన్ ఎ బరియల్ గ్రౌండ్)

ఎండిపోయిన నది ఒడి వాలున
పండిపోయిన పొగాకు తోట
వెల్లకిల పడుకుని వెళిపోయిన ఆకాశం కేసి
మృతనేత్రాలతో చూస్తున్నది
పాదముల చెంతనొక గోరీలదొడ్డి

బడికిపోయే దారిలో ప్రాక్చరిత్ర
నిశ్శబ్దశబ్దంలో నిదురించే జహాపనాలు
గుండె కవాటాలను తన్నుకొచ్చే జ్ఞాపకాలు

గాలి - నా చిన్ననాటి చేలాగాడు
గోలీలాటల గలగల నేల
తినేసి ఉమ్మేసిన రేగుపళ్లన్నీ
పెరిగి పెద్దయి ముళ్లపొదలై!


గప్‌చుప్ సాంబార్‌బుడ్డి - పురాస్మృత ప్రతి
కారుచీకటిలో చిరుత కళ్లు
-ఈ రావిచెట్టుని ఇంకా నరకలేదులే



సమాధులూ-బేరన్లు
పాత పోస్టాఫీసూ-ఫారెస్టు గెస్టవుసు
గోడపక్క ఉచ్చలు
సెట్‌ప్రాపర్టీ వలె
పిచ్చిగడ్డి మాటున
పాతికేళ్ల గాజుముక్క

పగబట్టి కాచుకుందా ఏంటి!
కసుక్కున కాలికి:
రక్తం.

కట్‌చేస్తే..
యాంబియెన్స్ కోసమన్నట్టు!
నాతో ఆడుకున్న పోరగాడు:
క్రూరమైన ఎండన పడి
కూనవరం గుట్టకింద
ముళ్లకంపలు నరుకుతున్నడు
మా ఇద్దరిలో ఫిలిప్ పిరిప్ ఎవరు
పిల్లా?
వేరీజ్ ఎస్టెల్లా?




థేమ్సు తీరాన
కులీన కుల సభ్యత్వానికి ముందు
పేరుకూడా పలకలేని పిచ్చి పిప్‌గాడు
తచ్చాడిన నేల
ఊరిమట్టి విశ్వజనీనము
-క్లినికల్ కోరిలేషన్!

సమాధుల మధ్య ఆడుకున్నందుకో - ఏమో!

మరణించని స్మృతులు
చల్లారని చితులు
గోరీలకింద కంకాళాలు:


స్నేహితులు
గుండెకూ గొంతుకూ మధ్య
పేరుకుపోయిన రూపాయి గాడీలు

(మీరు కాల్ చేస్తున్న సబ్‌స్క్రైబర్ కవరేజి ఏరియాలో లేరు లేదా ప్రస్తుతము స్పందించుటలేదు దయచేసి ఎప్పుడూ కాల్ చేయకండి)





# నీలె గగన్ కె తలే



ఆకాశం నిదురపోదు
నేనూ మేలుకునే ఉన్నాను
నేనొక పాటలోకి పరకాయ ప్రవేశం చేశాక
ప్లాస్మా తెరపై సీరమ్ కెరటాలు
లిక్విడ్ క్రిస్టల్ డిస్ప్లేలో
మిలమిల మెరిసే రక్తకణాలు
కారణమేమేనగా-
పాటలు చారిత్రక ఆధారాలు

సమ్మర్ ఆఫ్ నైంటీనైన్
పీరియడ్!
బ్రాన్ ఆడమ్స్ ఒక్కడే కాదు
నువ్వూ నేను అతనూ ఆమె


కూలిపోయిన క్యాంటీన్ ముందు
కుంగిపోయిన సిమెంట్ బల్ల
ఒక గ్రూప్ ఫొటో గుర్తుకు వస్తుందా?

నవ్వెప్పుడైనా
పురాతన కట్టడం గోడమీద
ఒక పేరు చెక్కలేదా!

నిదురరాని జాము
జ్ఞాపికలు; రాలుతున్న తోకచుక్కలు
ఆకాశం నిదురపోదు
మనలాంటివాళ్ల
కలలకు కావలి కాసేందుకు!
మనమూ మన పాటా సంగమించేవేళ
పారాహుషార్ చెప్పేందుకు!


అయినప్పటికీ
నేనింకా నిద్రపోలేదు
(కోయి లౌటాదె మేరె బీతె హుయె దిన్!)

బహుశా
దూరంగా వినిపిస్తున్న భూలే బిస్రే గీత్ లోంచి:
ఒక షెహనాజ్
నన్ను కాలర్ పట్టుకుని లేపి
ఈ కాలనాళికలో విసిరేసినట్టుంది





# ఫింగర్ ప్రింట్స్



నిద్దురలోనూ
మెలకువలోనూ
రొద
నిను వీడని నీడలా
నోకియా రింగ్‌టోన్‌లా
రివర్స్‌గేర్ హారన్‌లా

వేట: ది హంట్
నాడీమండలంలో నిల్వచేసిన
ఆర్డీయక్స్
-ఫాటల్ అట్రాక్షన్

ఓసీ అందాల రాక్షసీ
శూర్పణో రామచంద్రా

దిండుకింద బొండుమల్లెలు
గుండెకు కట్టిన ముళ్లతీగలు
ఎండోక్రేనియల్ కేవిటీలో రక్తకెరటాలు

ప్రేమినీ పిశాచీ
నేనెవరినీ కడుపుచేసి వదిలేయలేదే!

ఒక కట్ అవే షాట్‌లో
ఇంటి దగ్గర
మల్లెపూదండ

ప్లస్
ఒక బంగారుకొండ


నీ నవ్వు
కత్తిమొనలా ఉంది
శాంతిస్థాపక దళాల సైరన్‌లా ఉంది
నీ పరిహాస శబ్దతరంగం
వెన్నులో తెరలుతెరలుగా
జారుతోంది

సెల్‌ఫోన్ ధ్వనిలా నవ్వేదానా
పెదవుల మధ్య టొపాజ్ బ్లేడ్
బ్లడ్‌లైన్

ఏమోగానీ
ఒక అపనమ్మకం:
వెన్నుపూసలో మిన్నాగు దూరినట్టు ఉంది


అయిననూ

చివరకు నేను-
నీ నిండు వక్షోజాలకు వేలాడుతున్న
ఖండిత శిరస్సును
అనగా
క్లయిమాక్సును





## షాన్



**జీ**వితపు ఘనసమయం
నేనాకసాన్నంటిన!
* * *
కొన్ని ఒక రోజులు
ఎన్నెన్నో ఒక రోజులు
అనగనగా ఒక రోజులు
రెండు చేతులా
నిండు చందమామలు
మసకేసిన మబ్బులు రాల్చిన
వానచినుకు ముచ్చట్లు

లైఫ్ ఈజ్ కాలింగ్
వేర్ ఆర్ యూ


పరుగుపరుగున
ప్రజాప్రదర్శన

నా ఖజానా తెరిస్తే
స్నేహితులు

తన్హా సఫర్
ఆకాశం కింద ఎన్నో రుతువులు
పలురుచులు
విసవిసా దాటిన దశదశలు
ఆల్వేస్ లుకింగ్ బాక్
యే కహా.. ఆగయే హమ్!
రంగురంగుల ఆశ్చర్యాలు


ఫేడిన్-ఫేడవుట్
దృశ్యమాలిక
కవిత్వానికి భాషతో పనేమున్నది

సంచార జీవిత భరితం
చివరికొక
నైరూప్య వర్ణచిత్రం
అంతాకలిపి
ఒక లైబ్రరీ ఎడిషన్
* * *
జీవితపు ఘనసమయం
నేనాకసాన్నంటిన!





# సాలభంజిక




గగన జఘున ఘున
టాన్డ్ టోన్డ్ మిల్కీ సిల్కీ చాక్లెట్ స్కిన్
వళ్లో!
నేరేడుపళ్లో!

టైమ్ మెషిన్‌లో
బ్యాక్ టు ఫ్యూచర్
జలతారు జవరాలు
మగధ నుంచి
నేరుగా దిగుమతి చేసుకున్న
గాంధారశిల్పము
కళింగతీరపు
లావణ్య రేఖావిలాసము

లాంజరీలు
వేలాడే తోటలు
మిరుమిట్ల మేను ఆర్క్‌లైట్ల ఆర్పి
దెబ్బకు ఆప్టికల్ న్యూరైటిస్!


-కళ్లుపోయాయిరా నాయినోయ్!

హావెంట్ యూ ఎవర్ స్పాటెడ్ ద నింఫ్?
టేస్ట్ లెస్ రూస్ట్!
ఎలియన్ కాదురా..
-ఇలియానా!





# టి.ఆర్.పి



ప్రతి సాయంత్రమూ
-వచ్చే ఆకాశం కోసం

ప్రతి ఉషస్సు
ఓ ఆశ్చర్యప్రసారం
ప్రతి పరిచయం
ఓ అనుభవంతో కరచాలనం


ప్రతి సాహసం
ఓ సంచలన తరంగం
ప్రతి ప్రయోగం
ఓ నవీన ఆవిష్కరణం

భాయ్‌సాబ్
మెనూకార్డ్‌లో మనకై
నిత్యం ఓ ఉత్ప్రేరకం సిద్ధం

టుమారో నెవర్ డైస్
మనకు కావాలి
అంతులేనన్ని టుమారోస్


ప్రతిరోజూ ఒక పరీక్ష
ప్రతిరోజూ ఒక ఫలితం
ప్రతివిజయం ఇంధనం
ప్రతిస్వప్నం రేపటికోసం

ఇక్కడ
డెడ్‌లైన్సే లైఫ్‌లైన్స్!





# 24 సెవెన్



ఎటు చూసినా ఒక ఫ్రేము
ప్రతి దృశ్యమూ చట్రబంధము
దృగ్విషయము దీర్ఘచతురస్రము
కల ఒక నైరూప్యచిత్రము

నిద్దరలోనూ మెలకువలోనూ
వేటాడే ఫ్రేములే
నల్దిక్కుల్ గాజుతెరల్
చుటుముట్టిన ఫ్రేముల్

డిస్ప్లేడ్ ఇన్ లిక్విడ్ క్రిస్టల్
చకచకా కదులుతున్న
కలర్‌ఫుల్ శుక్రకణాల్

అన్నట్టు:
అక్కడ జీరో గ్రావిటీలో
వేలాడుతున్నది ఎవడురా?

లుక్ టు ద రైట్
లుక్ టు ద లెఫ్ట్


వెనకోముందో
స్వప్నరూపవిరూపాల్

దృశ్యాలు
దుఃఖపాతాలు
సన్నివేశాలు
చలనసూత్రాలు

నీ చుట్టూ నా చుట్టూ ఫ్రేముల్
సెకనుకు ఇరవైఅయిదు వేగంతో
నువ్వూ నేనూ కొట్టుకుపోతున్న
మోంటాజ్ ఛాయాప్రవాహాల్


రాగాల్ ద్వేషాల్
కోపాల్ జ్వాలల్
చినుకు ముత్యాల్
చివురు హాసాల్
పోరాటగీతాల్
బాహువుల్ బావుటాల్

ఫ్రేములు ప్రేమలు
అద్దంపట్టిన అన్నం మెతుకులు





# లాగాఫ్



షట్ యువర్ మౌత్
అండ్ ప్లే యువర్ గిటార్


పౌరసమాజమా
గౌణ సమూహమా
నీకూ నాకూ మధ్య

మోడీగార్డ్ అద్దాల గోడ
కలం వీరుడా
సృజనశీలుడా
ఆట మొదలైంది
ష్ నిశ్శబ్దం
ముందు సీట్లపై కాళ్లు పెట్టరాదు

రాజ్యము-పోలీసులు
కొరిడీకాయ వంటి విశ్వాసాలు
టచ్‌మీ నాట్!
గ్యాప్ ఈజ్ అవర్ బ్రాండ్


మనోభావాలు దెబ్బతింటే
ఇదే టిక్కెట్టుపై
మరుసటిరోజు ఇదే ఆట

మైడియర్ బ్రాండ్ అంబాసిడర్
రెక్కలున్నాయని ఎగిరిపోకు
ఈ ఆకాశం నీది కాదు
(సాటి పాత్రికేయులకు అంకితం)





# మరణ వాంగ్మూలం



ఆకాశం భూమీ కలిసే పూట
శబరీ గోదారీ కలిసేచోట
సంజెరంగుల్లో కమ్ముకున్న
విషాదపు జీర
చరమాంకంలో ఒకానొక గ్రామం
ఆ పక్కన
శిధిలమైన కొయ్యపడవ

కన్నతల్లి ముందు మోకరిల్లి
మరణవాంగ్మూలం వింటున్నాను

నది అలలపై ప్రతిబింబం
తలారి ముఖంలోని గాంభీర్యం
దూరాన
టూరింగ్ టాకీస్ నుంచి
ఆఖరి సన్నివేశపు ఆవేదన


ఇచ్చోటనే
కొంచెం ఇప్పసారా

కొద్దిగా కొమ్ముబూరా
ఇచ్చోటనే
చలువ పందిళ్లు
పొగాకు బేళ్లు


ఇచ్చోటనే
గలగల ఘల్లుమన్న
రేలారేలా పరవళ్లు

మరియూ ఇచ్చోటనే కదా
ఏడేడు తరాలు
ఎనకటెనకటి పాటలు
అనాది రాగాలు
ఆది పురాణాలు
విల్లంబులు ఎద్దుకొమ్ములు
తునికి చుట్ట పరిమళాల
గుప్పుగుప్పు గాలి గిరికీలు

తరతరాల పాదముద్రలు
హృదయాలు శిలాజాలు



పాయం బొజ్జిగాడు
లాస్ట్ ఆఫ్ ది కోయాస్
పెరిగి పెద్దయి
అలెక్స్ హేలీ అవుతాడా
ఆనకట్ట వెనుక అశ్రుజలధిలో
సీతమ్మ ముక్కుపుడక వెతుకుతాడా
లేక
అంతర్థానపు అంచున వేలాడి
రామాపితికస్ వలె
ఆంత్రోపాలజీ పాఠమవుతాడా




పురాతన జనసమాధి
జనసంస్కృతి జలసమాధి

చెరిపేసిన పాటలు
మునిగిపోయిన మానవుని జాడలు
ఊరిమధ్య రావిచెట్టుకు
అమాయకంగా వేలాడుతున్న
కబోదిపక్షులు
చివరకు మిగిలినది

ఛాతీమీద చల్లుకున్న
పిడికెడు నల్లరేగడి


రామయ తండ్రీ
నీ అరణ్యాన్ని
ఆవాసాన్ని ఆవరణాన్ని
లేడిపిల్లల్నీ అడవిబిడ్డల్నీ
నీ పాదాలు ముద్దాడే పాపికొండల్నీ
రేపోమాపో
రెవెన్యూ రికార్డుల నుంచి తొలగిస్తారు

రామా
ఇలా రా
నా పక్కన కూర్చో
నాతో కలిసి
ఈ మట్టి మరణవాంగ్మూలం విను
దమ్మక్క పెడుతున్న శాపనార్థాలు విను
వినరా విను!
సీలేరు ఒడ్డున విరుగుతున్న విల్లు
ఫెటఫెటేల్ ధ్వానాల్ విను!
వినరా విను!






# జేగురురంగు జ్ఞాపకం



**అ**ప్పుడప్పుడూ
నా గుండె చప్పుడు నేనే వింటున్నప్పుడూ
మీరంతా గుర్తుకొస్తారు

అప్పుడప్పుడూ
నా రక్త ప్రవాహంలో ఏదో అలికిడైనప్పుడూ
మీరే గుర్తుకొస్తారు

విమలఛత్ర ఛాయలో
బంగారులోకాన్ని కలగన్నరోజులు


దేహాలే రణన్నినాదాలై
ఊరేగింపులో ఉవ్వెత్తున ఎగసిన రోజులు

తెల్లారేసరికి గోడలమీద
జేగురురంగు అక్షరాలమై మెరిసిన రోజులు

మహాసభ ఉద్వేగంలో
పాటలమై పిడికిళ్లు బిగించిన రోజులు

డప్పుకొట్టు రమేషన్న
పాటపాడు సురేషన్న
సంపరశీను కాల్లో దిగిన బుల్లెట్
రక్తపుముద్దయిపోయిన సాయిబాబు

బీశ్రీనుతో కలిసి అంటించిన లితోపోస్టర్లు
రఘు నేర్పిన ఎర్రని గోడరాతలు
పద్మ పాడిన పాటలు




ఒకే కలనుకనే అపురూప స్నేహాలు

అప్పుడప్పుడూ
ఆకులవారి వీధికి వెళ్లడమంటే
చిరకాల జ్ఞాపకాన్ని పలకరించడమే
ఆఫీసు గాలిలో గిరికీలు కొట్టే
అనుబంధాన్ని కౌగలించుకోవడమే
జెండా నీడలో అన్నల గుండెల
అనురాగాన్ని అస్వాదించడమే


నిజం చెబుతున్నాను
అప్పుడప్పుడూ
ఒక రెట్రోవేదన మదిలో కదిలినప్పుడూ
నా కార్పొరేట్ చింతల కొలిమిలోంచి
ఒక నిప్పురవ్వ వేరుపడి-
నిద్రించిన చైతన్యపు అంచులు ముట్టించినప్పుడూ
కామ్రేడ్స్!
మిమ్మల్నే తలుచుకుంటాను
-మీకు లాల్‌సలామ్

ఆఫ్టరాల్ అవర్ హార్ట్ ఈజ్ ఆన్ ద లెఫ్ట్!






# స్లీప్‌లెస్ ఇన్ స్టూడియో



**జీ**రో క్యాండిల్ వెలుగు
బల్బుగుండెలో దిగులు
గోడమీద గ్వెర్నికాలు
ఈ రాత్రికి మిత్రులు

మంచం కింద మొలిచిన
జిల్లేడు పొదలు
సెరిబ్రల్ గోడల్లో
గోడుగోడున-
కాలర్‌ట్యూన్ ఘోషలు

కమిట్‌మెంట్లను పాటకట్టి
ఎవడో లూప్‌లో పెట్టాడు
కత్తిగట్టి


పదేపదే రివైండ్ చేస్తున్నాడు
కోరస్‌లైన్ నోట
కోరలు సాచిన డెడ్‌లైన్


వేర్ యామై స్లీపింగ్
నందికొండ వాగుల్లోనా
నల్లతుమ్మ నీడల్లోనా

కిటకిట తలుపులు
కిటారితలుపులు
వళ్లంతా కళ్లు
రాళ్లయిపోయిన కళ్లు


పొద్దుకోసం పలవరింత
ఓ కార్పొరేట్ చింత
ఇన్‌సెన్‌సిటివ్ ఇన్‌సెంటివ్
తెల్లారింది లెగండోయ్

-ఉల్ రే ఉల్!
వేకప్ టు ద వర్క్!






## కులగ్యూలా
**M.Phil**



ఎ-బి-ఎబి-ఓ
పాజిటివో-నెగెటివో
నాలుగంటే నాలుగు
రక్త వర్గాలు

కృతజ్ఞతలు మిత్రుడా
రెండు రక్తపుబొట్లు చిందిస్తాను

గాజునాళికలో
గోత్రాలు వెదకరా కులంబస్

(ఇక ఇంటి పేరునూ బంధుత్వాలనూ
పోల్చిచూస్తుండగా అతని ముక్కువాసన
పసిగట్టెను)


యురేకా!
-నువ్వు ఫలానా-

(అతను వంకరటింకరగా మెలికలు
తిరుగుతూ పరవశించిపోయెను.
విజయగర్వం అతన్ని వివశుడ్ని చేసెను)

కనిపెట్టావులే
తొక్కలో సీక్రెట్
నీ బట్టలూడిపోయాయ్ చూస్కో

అబ్బా... కంపు!

ఎవరక్కడ
వీణ్ణి మనుషుల మధ్య నుంచి
తీసుకుపోండి




జాలిపడుతున్నాను మిత్రుడా
ముసుగు తొలగిన నీ సంస్కారానికి
రెండు కన్నీటిబొట్లు రాలుస్తాను
తొడుక్కోడానికి నీకు
శుభ్రమైన బట్టలిస్తాను

కులధృవీకరణ పత్రాల్ని
కుప్పలుపోసి తగలేస్తాను


అయినా చాలకపోతే
నిన్ను యమ్మార్వో ఆఫీసు ముందు
పాతరేస్తాను

బట్, బిఫోర్ దట్!
నీకు
జాలిమ్‌లోషన్ పట్టించి
స్టీమ్‌బాత్ చేయిస్తాను
చర్మవ్యాధి వదిలాకే
కర్మకాండలు జరిపిస్తాను






# సెంట్ ఆఫ్ ఎ ఉమన్



నిరీక్షణ
మెరుపు కవళిక
నులివెచ్చని కనులు
తొలిచూపు


కొంగు నడుముకు చుట్టి
శ్రమతేర్చిన సొగసు
చెమట తడిలో
ముంగురుల మెరుపు
                    పరిచయం
అమృత స్పర్శ
కనుపాప అభయం
ప్రియబింబం
                    అనుభవం
అరచేతుల్లో
అనంతానురాగ రేఖలు
దోసిట ఆత్మావిష్కారం
                    విస్మయం
ఒడిలో పసికందు
కళ్లలో స్థితహాసం
కృతజ్ఞరేఖ
                    సౌందర్యం

చివరకు కదా తెలిసింది
నిన్ను ప్రేమిస్తున్నానని





# సిల్‌సిలా



**పు**వ్వులూ
మబ్బులూ
మంచుపొగలూ
:నీలాకాశం రాల్చిన
నులివెచ్చని చిరునవ్వులు

సంజెవర్ణాలూ
ఆకాశరేఖలూ


పక్షుల గుంపులూ
:అంచులు మెరిసే నీడలలో
రెండు దేహాల జాడలు

వెన్నెలా
వీచికా
ముంగురులూ
:వెండి లోయలో
వివశమైన అనుభవాలు

మరియు
కొమ్మచాటు పిట్టగూటిలో
మారువేషంలో మాటువేసిన
రహస్య షెహనాయిలు!


-రాత్ యా దో పెహర్ మే!

మనం సంచరించే చోట
... ఎకోలో!
నిశీధి వీధులను మేల్కొలిపే పాట!





# సీక్రెట్ గార్డెన్



నీ కళ్లలో
అనంతాంబరపు నీలినీడలు
కలవో లేవో
కానీ,
వేటకళ్లలో వెంటాడే మర్మం
నీడల జాడల రహస్యం


నీ నవ్వుతెరల కెరటాల్లో
పూలడోలికలు
తేలియాడునో లేదో
కానీ,

జీరలు పోయిన ఊసులు
చిక్కుముడుల నాడులు

నీ దేహభాషలో
మోహపు సెగలు
రగులునో తగులునో
కానీ,
జివజివల చాటున
మాటువేసిన మాయాసర్పాలు

నీ షిపాన్ రెపరెపల్లో
ఈస్ట్రోజెన్ ధారలు
కురియునో లేదో
కానీ,
చున్నీ వీచిన తెమ్మెరలో
స్పర్శలు విసిరిన ప్రశ్నపత్రాలు

కవీ!
-గీ ఆడదాని మనసైతే
అర్థమైతల్లే!





# వన్స్ బిటెన్

షైనీ యాపిల్
బెర్ముడా ట్రయాంగిల్
-లవ్ అండ్ సిన్

ఒకడు ప్రేమికుడు


ఒకడు సాహసికుడు
ఒకడైతే
వాంఛలతీరపు పరిశోధకుడు
చివరకు పరివ్రాజకుడు

కనుగీటే మర్మం
పండుకొరికిన పాపం
జన్మాంతర మోహం
-ట్వైస్ షై!

ప్రేమసీమలలో చరిస్తే
లేపనాలు
కరిగిపోక తప్పదురా నాయినా


తాపము పాపము
కానీ కామము మోక్షము!
మరి భద్రజీవన బంధము?

-బోలో శుభ్‌షామ్
హరేకృష్ణ హరేరామ్!






# డెవిల్ ఇన్ ద ఫ్లెష్



పదమూడో తేదీ శుక్రవారం
చూస్కో కాస్కో మాస్కో నుంచి
రహస్య ప్రేమికుడిలా
రాస్‌పుటిన్ దిగివస్తాడు
నిన్ను గిటారులా పొదివి పట్టుకుని
సుతారంగా మీటి
అవర్‌గ్లాస్ ఫిగర్
అబ్సెసివ్ కంపల్సివ్
గొంతులో కొంచెం ఎలిక్జిర్


పక్కలో కాపుకాసిన
రెండుతలల పాము
పడగలు ఒడిసిపట్టి
విషం అమృతం
యేం?
నువు మాత్రం తినలేదా నిషిద్ధఫలాన్ని!

ఇప్పుడు సర్పెంట్ లేడు
ఆ చెట్టును మల్లికా షెరావత్ మలైకా అరోరా
పెనవేసుకుపోయారు

జలతారు కేమిసోల్ వలవేసి
మనీషా కొయిరాలా ఫాట్ బెల్లీపిట్‌లో పట్టిన
బంగారుచేప
అక్వేరియంలోంచి బుడుంగ్ బుడుంగ్

మూడ్స్ అల్ట్రాథిన్
కీప్ హెర్ గెస్సింగ్ వాట్ కలర్ యూ వేర్ దిస్ నైట్!
-పోనీ ఒక ఫాంటసీగా!?
పౌనఃపున్యము
ఎ ఫాట్ పోకెట్ గెట్సెట్ ఆల్
వీడేరా వీసాగాడ్
*ఓ మి గాడ్! ఉయ్ వైబ్‌లైక్ హెల్ నా!
(*ఆమె చాలా పాష్‌గా డైలాగ్ చెప్పను)
మరైతే ఆలస్యమెందుకు
స్వర్గంచూద్దాం రా!

దుర్గం చెరువుమాటున
సీక్రెట్‌లేక్ ఒడ్డున ఒరుసుకుపోయిన రహస్యాలు
నువ్వు వాడిని, నేను దాన్ని!




యంటీవీ బకరా
మేక మేమే* అనును

(*అతను అచ్చం
మేకలాగే మిమిక్రీ చేసి
చూపించును, ఇద్దరూ
కలిసి పగలబడి
నవ్వుకుంటుంటుండగా
తెరపడును)


యాక్ట్ టు
లైట్స్ఆన్!
కర్టెన్స్‌రైజ్!

ఇంతలో
మెలకువ
బతుకు కలతనిద్ర
కలల రొద
అది ఎవడితోనో ఫ్లర్ట్ చేస్తున్న నవ్వుల గలగలఘల!
చెవులు చిల్లులు పడుతున్నై
చెంపలమీద ధారగా రక్తం
బ్లేడు అంచున మెరుస్తున్న భయం!





# టచ్: ది పబ్



**మూ**సిన కళ్లకే కన్పించే దృశ్యం
వేలికొసన ఓ మంత్రం
ధ్యానం
స్పర్శానుభవం

అప్పుడప్పుడూ
శబ్దమే స్పర్శిస్తుంది
అప్పుడప్పుడూ
కళ్లకే స్పర్శ తెలుస్తుంది
ఎప్పుడైనా
మౌనరాగమే మనసు తడుతుంది
-స్పర్శతోనే బతుకు మొలకలేస్తుంది


నిన్ను గట్టిగా వాటేసుకుంటా
ముద్దుపెట్టుకుంటా
నలిపిపడేస్తా
ఓలమ్మో తిక్కరేగిందా?
:మేడ్ ఫ్రం ఒరిజినల్ ఇటాలియన్ లెదర్
నీ బంగారురింగులో మెరిసే
స్వరోవ్స్కీ రంగురాయిలా

రాక్‌సాలిడ్;
        -ప్రాణం ఎక్కడున్నదీ
        -ఫీలింగ్ ఎక్కడున్నదీ
తొక్కలోది
ఆ గజినీగాడే మర్చిపోయాడు
మనకెలా తెలుస్తది.

కిరాతకమైన వేసవిగాలిలో
ఎకోలో వినిపించే
గాజుల గలగలలాగా
పడావుపడ్డ క్షేత్రంలో
ఒక్క చినుకై రాలవే!

ఒసేయ్
కళ్లు మూసుకుంటా గానీ
నాక్కొంచెం చర్మం ప్రసాదించవే!
(అట్నుంచి మౌనమే జవాబు)

పోనీ
పారొచ్చేత్తా గానీ
నువు కొంచెం చర్మం తొడుక్కోయే!





# నెత్తుటి రుణము



కనుచూపు మేరా నెత్తురు
ముక్కు పుటాలు పగిలే కమురు
ఎండమావులూ ఒయాసిస్సులూ రక్తవర్ణపు
ఇసుకలోయలు
ఖర్జూర చెట్లకు కాసిన మాంసపు గుత్తులు

ఇనుపడేగ రెక్కలు
యంత్రభూతాలు; రక్తంతోడే రిగ్గులు!


పదిలక్షల ఖండిత శిరస్సులు
కోటికోట్ల ప్రశ్నల చారికలు

రాలిపడ్డ కుత్తుకలలో
కుతకుత ఉడుకుతున్న ప్రశ్నలు
నూనెకూ నెత్తుటికీ మధ్య రగుల్కొన్న రసాయన
చర్యలు

ఎన్ని గ్యాలన్ల నెత్తురు పోస్తే మీ కార్లు పరిగెడతాయి?
ఎన్నెన్ని మాంసఖండాలను పిండితే మీ ఆయిల్ దాహం
తీరుతుంది?


సద్దాము అహ్మదీ ఛావెజ్
మండుతున్న జాతుల ఎగురుతున్న జెండాలు
చెల్లాచెదురైన ఛిద్రదేహాలన్నీ పోగుచేసుకుంటారు
భుజం మార్చుకుంటారు
రుణం తీర్చుకుంటారు

విచారణ లేకుండా ఉరితీస్తారు
పెట్రోలుపోసి తగలబెడతారు
ఒరేయ్!
నెత్తురుపోసిన హోమగుండం ఎన్నటికీ చల్లారదు!





# బార్న్ టు లివ్



చచ్చినోడా
మళ్లీ పుట్టరా
నీ శవపేటికలోంచి
రెండు చేతులు రగిలి
కొండచిలువలై చుట్టి
పారవశ్యం పిండి

పుట్టినరోజు వరకూ
సమాధిలో ప్రవేశించక
గ్రేవ్‌యార్డ్ షిఫ్ట్‌లో
థ్రిల్లర్లు వెలిగించరా


ఖండాంతర నల్లనిజాతుల
తెల్లని పళ్ల, వెలిగే కళ్ల
డప్పాధమాల్ సంగీతావరణంలో
బ్లాక్ బ్యాక్‌స్ట్రీట్లను పరిచి

సమూహ దేహాలను పూని

తగలబడే శిలువల
దగ్ధస్వరాల సెల్లార్ కాంతుల
టక్కుటమార్
ఎగరేసిన కాలర్ల విన్యాసాలు
ఊరి పిల్లల పిచ్చిగెంతులు
మెరిసే నీ భుజకీర్తులు

నువు
జీసస్‌లా లేచొస్తావని
పాటలతో పాపాలు కడిగేస్తావని
శరీరాలు ఆకాశం కింద పరిచి
అంతిమ సంస్కారాలు లాకర్లో పడేసి
కళ్లలో నియాన్ చూపులు గుచ్చుకుని
-నిరీక్షణ!

చచ్చినోడా
మళ్లీ పుట్టరా
(ఆగస్టు 29 మైకేల్ జాక్సన్ పుట్టిన రోజు)



# ఓ రెండు ప్రోయమ్స్

# R.E.M




ఐ కాంట్ లిఫ్ట్ ద వెయిట్. బరువెక్కిన నేత్రాలనిక మోయలేను. కానీ మూయనూ లేను. తెలియని ఏ తీవ్రశక్తులో రెప్పకూ రెప్పకూ మధ్య. ఎవడో హెర్క్యులిస్ అనుకుంటా. ఈ భూమిని మోసే డ్యూటీమాని ఏమిటిలా నా ఇనుప కనురెప్పలను లేపి పట్టుకుని. వీడితో పోరాడేందుకు కొత్త డ్రగ్గులేమొచ్చినవి. సెర్చ్ ద నెట్.

వలలో చిక్కుకున్నవాడు కలలెలా కంటాడు. అలల కల్లోలంలో ఏ దిక్కుకు ఈదుకుపోతాడు. యూ స్లీప్ వోన్లీ టూ వేకప్ టూ ద డ్యూటీ. రేపేం చేయాలో కలతకంటూ అటు తిరిగిటుతిరిగి-అర్ధరాత్రి బీపీమీటర్ మెర్క్యురీ పైకీ కిందకీ; నీ పల్స్ నీకు వినిపిస్తుందా. ఇదొక గతుకుల రోడ్డు. బెడ్డనుకున్నావా బిడ్డా. ఎవడో కన్నుకొట్టి పరాచికాలాడుతున్నాడు. అరాచకుడు.

ఒక రాత్రి నౌకరీ డాట్‌కామ్. ఒకోరాత్రి నీ ముందు చేయిచాచి అడుక్కున్న మాసిపోయిన పసిపోరడు. రైలులో మూలన ఒదిగి కూచున్న ముదుసలి జ్ఞాపకం ఓ రాత్రి నిద్రాభంగం. మరో రాత్రి కేన్సర్ ఆస్పత్రి వరండా. అప్పుడప్పుడూ నీకు దిక్కులేనపుడూ అమ్మ. నీ భుజం వెనుక

లక్షక్యూసెక్కుల బాధ్యత ప్రవహిస్తుంటే నాన్న. ఒక అర్ధరాత్రి అలిగిన ప్రేయసి. తేడా వస్తే ఉమెన్‌స్కోర్న్‌డ్-విజయలలిత నటించు పగబట్టిన ఆడది. మరో తెల్లారుజామున ఒకానొక పురాతన తీరని కోరిక-పక్కలో దూరి భయపెడుతున్న రొమాంటిక్ ఫియర్. బాసూ వాడు హరి సాడు-హెచ్ ఫర్ హిట్లర్ ఐ ఫర్ ఇడియట్! నువ్వు శవమై చెట్టుకు వేలాడుతుంటే-ఒకరు భుజాన వేటతుపాకి పెట్టుకుని ఫొటో దిగుతారు.

డిస్టర్బ్ చేయకు డిస్టర్బ్ చేయకు. మల్టీ సంగతుల ముసురు. నిదురకు తగిలిన ఉసురు. అకస్మాత్తుగా వెన్నెముకలో పసరికపాము దూరి జరజరపాకే జ్ఞాపకం కాటేసిన భయోత్పాతం.

ఎందుకోగానీ ఇక ప్రశాంతంగా, కలలకు దొరక్కుండా కునుకు తీద్దామనుకున్నప్పుడే-అశాంతసమీరాలు గంటకు వందల కిలోమీటర్ల వేగంతో వీస్తాయి. సకల శత్రువులూ చుటుముట్టిన మానవహారం నలుదిశలా నిర్మించిన ఘెట్టో. ఏ ఇనుప గేటు నుంచో హఠాత్తుగా లంఘించే సింహాలు. గ్లేడియేటర్! ఆర్ యూ రెడీ?

స్లీప్‌లెస్ ఇన్ బంజారాహిల్స్. స్లీప్‌లెస్ ఇన్ రాజీవ్‌నగర్. నిదురా రావమ్మా రావే. ఇదిగో నిన్నే, ఇటు తిరుగు. కొంచెం జరగవే. (ఆమె నీ చేతిని విసిరికొట్టి కసురుకుంటూ దూరం జరిగి రగ్గుకప్పుకుంది -నువ్వెంత గోముగా అడిగినా వినకుండా). చూడు నటభూషణా! స్లీప్ ఈజ్ ప్రెషయస్ ఫర్ హర్. ది వోన్లీ లగ్జరీ. అండర్‌స్టాండ్?

ఊరే నిదరోయిందిలే-క్లయిర్‌వాయెన్స్‌లో కుక్కమొరుగులు. మారుమూల వీధి అరుగుల ఎకో ప్రకంపనలు. సైలెంట్ సౌండ్. ఈ చీకటి అంచుపట్టుకుని వేలాడుతూ-కనులు బరువెక్కుతున్న కొలదీ దీర్ఘమవుతున్న రాత్రి. షట్ వైడ్ ఓపెన్. ఒకడు నిద్రలేక ఒంటరి. చీకటిని కాగడాలో నింపుకుని ఏ దీపస్తంభం పక్కన నిలబడినా ఏమి ఫలితము.

మరైతే సిగరెట్ అలవాటు లేనివాడి పరిస్థితేమిటి. ఆ పూట పెగ్గు దిగని వాడి సంగతేంటి. ఒంటరి బాల్కనీ నెత్తిమీద చుక్కల్లేని ఆకాశం. లివింగ్‌రూంలో కేబుల్ కనెక్షన్ లేని యల్‌సీడీ తెర. తిమ్మిరెక్కినట్టు! ఆ అలజడి నీ గుండె అంతరచిత్రానికి అద్దమా, అర్ధమా?

అలజడి మా జీవితం. ఆందోళన మా ఊపిరి. తొక్కలోది-మీ బాబుసొమ్మా! మాదీ అదే అలజడి, అదే ఆందోళన. మీరు పగలంతా అలజడులూ ఆందోళనలూ చేసి అలసి రాత్రికి అన్నీ మరిచిపోతారేమో. మేము ఏ ఆలోచనా దరిచేరని గజిబిజీ బతుకుపోరులో అలసి సేదతీరేటప్పుడు చుట్టుముడతాయిరా అలజడీ ఆందోళనా. అలజడీ అండ్ ఆందోళనా మనందరివీ. సమాజసంపదలు.

ఇంకెవరూ లేరా. నీతో పాటూ ఏకకాలంలో ఏకసందర్భంలో ఏకభావనలో కరకు మెత్తని పరుపు మీద నరకలోకపు జాగిలమ్ములతో పోరులో నిమగ్నమైన వారెవరూ లేరా. ఎక్కడో ఏదో చోట. ఎప్పుడో ఏదో ఒక పూట. కోయి యహా, కోయి జహా. తుమ్సే హో తుమ్సే ప్యార్. థోడా ఎంపథైజ్ కరోనా! ప్లీజ్.

ఒక తారక ఎర్రబడిన కళ్లతో సీసాలోంచి నాలుగు నిద్రమాత్రలు ఒంపుకుంది. ఒకడు వలచిరాని నిద్రను తూలనాడి బీచ్ ఒడ్డున బీర్‌బాటిల్‌తో కూచున్నాడు. ఒకడు ఫోన్ దగ్గర పెట్టుకుని కాల్ చేసీ కట్ చేసీ కాల్ చేసీ కట్ చేసీ ఎటూ తేల్చుకోలేక నెత్తి బద్దలు కొట్టుకుంటున్నాడు. ఒకడు చానెళ్లు మారుస్తున్నాడు. ఒకడు పుస్తకాలు చించుతున్నాడు. ఒకడు యాంగ్జయిటీ న్యూరోసిస్ పట్టి జుట్టు పీక్కుంటున్నాడు.

రెమ్ అంటే రాపిడ్ ఐ మూమెంట్. అయామ్ అంటే నేను. నేను ర్యాపిడ్ ఐ మూమెంట్‌నా. నాది ర్యాపిడ్ ఐ మూమెంటా. లేక నిద్రపట్టని రాత్రి నీలో రగిలే అస్తిత్వపోరాటమా.

# మూన్‌వాకర్



**Y**ou have to show them that you're not really scared
You're playing with your life,
this ain't no truth or dare
They will kick you, then they beat you
then they'll tell you it's fair
so beat it, but you wanna be bad
just beat it just beat it
no one wants to be defeated

పాత పానాసోనిక్ టేప్‌రికార్డరొకటి పెట్టుకొని ఊరి చివర చెట్టుపుట్టల్లో తొక్కలో పిక్‌నిక్ పేరుతో వేసిన ఫస్ట్‌స్టెప్ బీటీట్ బీటీట్. దండాలు దొరా దండాలు! నువ్వేంటో నీ పాటేంటో దాని అర్థమేమిటో తెలియకుండానే నీ బీట్ మా హార్ట్‌బీట్ చేసుకున్నందుకు. పాన్‌షాపులో సన్ మేగజైన్ కొనుక్కొని నీ పోస్టర్లతో రూమంతా పెయింట్ చేసుకున్నందుకు. వళ్లంతా నిన్ను పూసుకుని ప్రెషర్స్ పార్టీలో బాడీని బ్రేకులు షేకులు చేసుకున్నందుకు. ఒకటికాదురా జాకూ. నీ అండజూసుకుని వందారెండొందల్ వేషాలేసినందుకు. అనుభవించాలి కదరా రిథమ్ బ్లూస్. నీకూ నీ ఏరులు పారే పాటలకూ కోటిదండాలు శతకోటిదండాలు.

నవనాడులతో పాటలు తోడి వళ్లంతా కాల్వలు తవ్వి నీ దెయ్యం పట్టిన దేహం ఊగించి శాసించి బీటిట్ బీటిట్ చచ్చేలా గొంతుపగిలి గానస్రావమయ్యేలా. ఏడుపొచ్చేస్తుందిరా నిన్ను తలుచుకుంటే. నువు ప్రసాదించిన యవ్వనం, నువు దానం చేసిన వెర్రితనం నీ పాయింట్ షూస్ నీ షోల్డర్ మోడల్స్ నీ లిప్‌స్టిక్ రెడ్! కింగ్ ఆఫ్ పాప్!

మూర్తిగారు ఫ్లాంట్‌చేసే కెన్నీ రోజర్స్, ఎరిక్ క్లాప్టన్ మాకెందుకో ఎక్కలేదు. ఎల్విస్ ప్రెస్లీ మేం పుట్టేనాటికే చచ్చిపోయాడు. మ్యూజిక్‌లో బ్లాక్‌మేజిక్‌కు మోహితులమై చూస్తున్నప్పుడు మైకేల్ జోసెఫ్ జాక్సన్ గాడు అన్నచెల్లెళ్ళీ, అక్కదమ్ముళ్ళీ టోటల్‌గా జాక్సన్‌ఫైవ్‌నీ విచ్ఛిన్నం చేసి థ్రిల్లరై బిల్‌బోర్డ్ మీద అవతరించాడు. దెబ్బకి తెల్ల బీటిల్స్ చరిత్రలో కలిశారు. ఆబా నీ దెబ్బకు మామామియామంటూ మాయమైంది.

నేరేడుపండులాంటి నువ్వు. మల్లెపువ్వులాంటి నవ్వు. నుదుట జెల్లీ దిద్దిన వంకీలు. సెరామిక్ గోలీల్లాంటికళ్లు. అమ్మోరు పూనినట్టు నీకు పాట పూనుద్ది. నిన్ను వింటున్నా చూస్తున్నా గిరిగిరగిరాంమని తలతిరిగి వళ్లుతూలి కనులు మోడ్పులు పోయి సంచలిత ధ్యానసంచారం! పాట విన్న ప్రతిసారీ మనోఫలకాల ప్రకంపనం! నీ స్కేలూ పిచ్చూ తెలీదు గానీ బాస్‌గిటార్ బిల్లీజీన్ మోహతంత్రుల మూర్ఛనలు కొలిచేది ఒక్క రిక్టరు స్కేలే రా నా మైకేల్‌మదన్‌కామ్‌రాజా!

నిన్ను చూసే నేను చందమామ మీద నడవడం నేర్చుకున్నాను. మూన్‌వాకింగ్ ఈజ్ ఏ వే ఆఫ్ లైఫ్. జెల్లీబీన్‌లా జరజరా జారిపోడం తెలుసుకున్నాను.

నువ్వేంటిరా? నీ వళ్లంత ధిక్కారమేంటిరా? ఈజిప్టురాణిని లేపుకుపోతావా, డౌన్‌టౌన్ కిలాడీని వెంటాడతావా. హూజ్ బాడ్? సెల్లార్లూ బ్యాక్‌స్ట్రీట్లూ గ్రాఫిటీలు పూచే మెట్రోలూ-గుంపుసంస్కృతి గుబాళించే డేంజరస్ సీమలో; శ్మశానవీధుల్లో నిదురించే ఆత్మలకు ఆడుకోడానికి దేహాలు విసిరేసి, నీ కళ్లల్లో, పిశాచాన్ని ధరించి; పురాజన్మల భయతాత్వికత విహ్వాలించి! - బాబూ ఇక్కడ

దెయ్యాల్లేవని వాదించే ఇన్నయలెవరయా? ఎక్కడ లేదు గురూ దెయ్యం! భూతప్రేతపిశాచగణారే నారేభంభం డంఢండంఢం. నీలో నాలో ఆమెలో అతనిలో. ఈ భూమి ఒక దిబ్బరాజ్యం. దెయ్యాలే ఇక్కడ పౌరగణం. లివింగ్, డెడ్ మరియు అన్‌డెడ్. సబ్‌వే ఈజ్ అవర్ హాంగవుట్!

పాటంటే పరవశం కాదు ఆవేశం. పాటంటేతన్మయం కాదు తనువులో రేగే తుపాను. స్వరమంటే నిప్పురవ్వలెగసే కార్ఖానా గొట్టం. తొక్కలో తాళాలూ సంధ్యాసమయపు తాంబూలసేవనరాగాలూ తత్వాలూ చుట్టచుట్టి పాత యల్.పీ రికార్డుల్లో భద్రపరిచి; ఇప్పుడిక మాస్ హిస్టీరిక్ లయధ్వానాలకు జయం. పాటలు కూడా కాలరెగరేస్తాయని రుజువు చేసిన యుగం. దేహం ఒక సంగీతవాయిద్యమై. దేహభాషే గేయమై. గురి చూసే కళ్లు, బుల్లెట్లయిన చేతులు. సౌదాకి వళ్లు పిడికిలయినట్టు నీకు వళ్లు పాటయి ఊగిపోయిందిరా-ఆఫ్ ద వాల్ రాలిపడ్డ గ్రాఫిటీలాగా.

ఆఫ్రికన్ టోటెమ్‌లు, ఇల్లినాయిస్ పల్లె బరియల్ గ్రౌండ్‌లు మరియు పిల్లలు పిల్లలు కొల్లలు కొల్లలు. నీ బాల్యం నిన్ను వెంటాడినట్టు ఎవడినీ వేటాడలేదా. బ్లాక్ ఆర్ వైట్. ఏదైనా అవనీ. నానా నరవర్గ నృత్యగాన జాతుల రీతులు సంగమించిన సంగీతసంకలనం. బహుశా నిన్నేదీ శాషియేట్ చేయలేదేమో. సంగీతమో మృత్యువో రెంటిలో ఏదో ఒకటితప్ప!

మైకెల్ జాక్సన్ ఇకలేడు. ఉంగరాల జుట్టు నల్ల పసిపిల్లోడు. సక్సెస్‌ని హాండిల్ చేయలేక తెల్లబోయి చచ్చిపోయాడు. పోరా పో! నీ పాటలున్నాక నువ్వెలాంటోడివైతే మాకేంటిపోరా. నీ ఆటలున్నాక నువ్వుంటే ఎంత, పోతే ఎంత పోరా, యు కాంట్ గో నో వేర్!

ఇప్పుడైనా ఈ వాల్డ్‌ను ఎవడైనా హీల్ చేస్తాడా. మళ్లీ ఒకడు కనీసం సింబాలిక్‌గానైనా స్వస్తిక్‌లను ధ్వంసంచేసి, త్రిబుల్ కె అను కుక్లక్స్‌క్లాన్‌కు నిప్పుపెట్టి ఆపై సింహమై సఫారీ చేస్తాడా!

రీమిక్స్‌కు లొంగనోడా నువ్వు రీబోర్న్ అవ్వాలిరా!

# లవ్వాలజీ



# వేర్ వర్ యూ ఆల్ మై లైఫ్?

**Tell me! Where were you all my life?**

అందాల రాక్షసీ చెప్పవే చెప్పు. ఇంతకాలం నువ్వేమైపోయావ్. ఇంతకాలం ఏ మబ్బులచాటున దాగున్నావ్. ఇప్పుడా నువు తారసపడేది. ఇప్పుడా నువు కొండవాలు చూపు విసిరేది. ఇప్పుడా నువు నా రక్తనాళాలలో ఆనకట్ట కట్టేది. ఇప్పుడా నువు...

నేను సంచారినై పిపాసినై ఒంటరినై ఒకపరి తుంటరినై గోడలమీద ప్రతిష్టించిన పోస్టర్‌గాళ్స్ కళ్లల్లోంచి ప్రవహించే కసిని దోసిటపట్టే రోజుల్లో, ఇన్ మైరూమ్ ఇన్ మైవాల్డ్. వేర్ వర్ యూ ఆల్ దీజ్ ఇయర్స్. నీతో నేను, ఎన్నో నీవులతో నేను. నీలాంటిదే అనుకుని కనెక్టయి, ప్లగిన్ అయి, వరకు లాగిన్ అయిపోయిన తర్వాత, ఇప్పుడా నువ్వు కలిసేది! అజూబా, మైహూ వాండరర్. అనగా నేనొక ప్రేమ పిపాసిని. అవునూ ఇంతకీ నువు ఏ ఆశ్రమవాసివి?

నీ యంకమ్మ. ఏందిరా బాబూ ఇది. ఈ దాహం తీరనిది. ఆ హృదయం దొరకనిది. నిజమేనా? నువ్వొక హృదయం కోసం వెతుకుతున్న మాట నిజమేనా. లేక హృదయం పాస్‌వార్డ్‌తో ఒక

శరీరాన్ని లాగిన్ చేద్దామనుకుంటున్నావా. మేనిస్పర్శతో పనిలేని ప్రేమ రంగేమిటి? ప్రేమ భావన లేని కామములో రుచి ఎంత? మీమాంస! మనసు ఒకరిపైనా మనువు ఒకరితోనా. మీనా, పాతసినిమా, కడలికి ఎన్నో నదుల బంధము మనిషికి ఒకటే హృదయమూ. నేను మనిషినా, సముద్రుడినా! మైడియర్ ఫ్రెండ్స్. మైడియర్ మేల్‌కొలీగ్స్. ఆర్ వుయ్ హనీబీస్? నమస్కారం రాజేంద్రప్రసాద్ గారూ. మీరు తేనెటీగ చిత్రంలో నటించినప్పుడు మీ అనుభూతులు మాకోసారి వివరిస్తారా. మైకు ముందుపెడితే బైటిచ్చేవాడే లేడు. మోహమా దేహమా! నువ్వు కమ్మేసిన మేఘమా? నాకైతే డౌటే గురూ. ఆర్ వుయ్ మేడ్ లైక్ దిస్?

ముందుగా ఒక ప్రశ్న. జీవితంలో ఒక మనిషిని ఒక్కసారే ప్రేమించగలం-వందలాది సినిమాల్లో వేలాది డైలాగుల్లో లక్షలాది సార్లు వినిపించిన ఈ మాట నిజమా? ఒకరికొకరు అనేది కట్టుబాటా కమిట్‌మెంటా. రెండక్షరాల ప్రేమ, రెండు క్షణాల ప్రేమ; కేవలం ఎగ్జిక్యూటివ్ బాండ్ పేపర్ మీద ఇంకుపెన్నుతో రాసుకునే ఒప్పందమా. ఏమో తెలీదు. జీవితం నిరంతర అన్వేషణ. గాడ్ లవ్స్ ఆల్. ఉయ్ ఆల్ లవ్ ఆల్. నిశ్శబ్ద్. అమితాబ్ అంకుల్! నీ మౌన సంఘర్షణం ఏ ప్రేమతత్వ ప్రతిఫలం?

ఓర్నాయినో ఎక్కడా అనకురా బాబూ. రాళ్లేసి కొడతారు. దేవునికి కూడా లాస్ట్ టెంప్టేషన్ కలిగెనట. పురాణములన్నీ టెంప్టేషన్‌లోనే పుట్టెనట. పుక్కిలి బర్స్ట్ అయితే విషయం గటగట కారుద్ది.

విశాల హృదయమో హృదయవైశాల్యమో. గది కిటికీలు తెరచి ఉన్నప్పుడు పిల్లతెమ్మెరలూ తళుకుతారలూ పలకరించక మానవు. ఇప్పుడు తెలిసిందిరా కవీ, నువ్వెందుకన్నావో; తెరచి ఉంచేవు సుమా త్వరపడీ నీ హృదయమూ-అనీ.

తుజే జమీ పే బులాయా గయా హై మేరెలియే! ఏమో తెలీదు. ఎప్పుడూ ఒక విస్మయం తలుపుతట్టినట్టు. ఎప్పుడూ ఒక అద్భుతం నవోన్మేషంగా సాక్షాత్కరించినట్టు. ఎప్పుడూ ఒక మనోసంచలనం ప్రకంపించినట్టు. ఎప్పటికప్పుడు కొత్తగా యవ్వనం చివురేసినట్టు. ఎప్పటికప్పుడు ఒక కొత్త పరిచయం చిరునవ్వినట్టు: హేయ్! వేర్ వర్ యూ ఆల్ మై లైఫ్? ఇప్పుడా నువ్వు కలిసేది? అంతా ముగించి, హృదయ యవనికలు దించి. బస్ ఇత్నాహీ ప్యార్ అనుకుని. బస్ ఇత్నాహీ ప్యాస్ అని మూతపెట్టి. బట్, ఈ దాహం తీరనిది, ఈ పాపం టెస్టోస్టిరాన్‌ది. ఓపెన్ ససేమ్!

ఇది కొన్నేళ్ల క్రితం నాటి సంగతి. బహుశా ఓ పదిహేనేళ్ల సంగతి. మాధవిని చూసి అమితాబ్ బచ్చన్ వండరైపోయాడు: వేర్ వర్ యూ ఆర్ మై లైఫ్? అని ఆశ్చర్యవదనుడై ప్రశ్నించాడు. ఇప్పుడా అని నిరాశ ప్రదర్శించాడు. బహుశా ఇది అమితాబ్ ఒక్కడి అనుభవమే కాదేమో. నిజం. గ్యారంటీ!

కవి మాటలు గుర్తుకు వస్తున్నాయి: **ఎవరోహో ఈ నిశీధి దారులందు ఇపుడా నను పలుకరింతురు.** అయిననూ పోయి రావలె ప్రేమనగరుకు. మోహమో దేహమో వయస్కాంత క్షేత్రంలో ప్రవేశించినప్పుడు, ప్రేమవీచిక మేనిని స్పృశించినప్పుడు కృశించి నశించిపోవలెనా లేక స్పందించి జివజివలాడిపోవలెనా!

సుఖంగా ఉన్న ప్రాణానికి (ఎ)ఫైరెందుకు అంటించుకుంటావ్‌గానీ, తొక్కలో ఫీలింగ్స్ పక్కన పెట్టి-సంసారం సంసారం ప్రేమసుధాపూరం నవజీవనసారం-మైల్డ్ ఎకోలో ఘంటసాల పాటపెట్టుకుని, పెగ్గుచేతబట్టి బాల్కనీలో రిలాక్సవరా కుటుంబరావ్!

**Ps. written in a state of confusion. (or is it a confession?)**

# లవ్ ఆజ్‌కల్



ఉమ్రభర్ కోయి తుమ్ నే పుకార్ కర్‌తే హై ఉన్ కా నామ్; ఓ ఫిర్ నహీ ఆతే! శలభము, ఆత్మహననము, పార్వతీ కోసం మొదలైన ఆత్మవినాశనము. బ్రేక్‌డ్యాన్స్ వేరురా ఇది-హార్ట్‌బ్రేక్. అర్ధరాత్రి దాటినా గూడు చేరని పక్షులుంటాయి. సంజెకెంజాయలు మాయమైనా ఆకాశం వీడని విహంగాలుంటాయి. టైముకి ఇంటికెళ్లాలని రూలేమైనా ఉందా.

ఒకసారి నవ్వి పడేసిన జోకు. మళ్ళీ విసిరితే లాభం లేదు. కానీ బాధ అలాకాదు. ఒకసారి దుఃఖపడి వదిలేస్తే పోయేదా? వెన్నులో దిగిన బాకు లాగా-ఫిర్ వోహీ యాదే! నిజానికి, ఇట్స్ సో హార్డ్ ఫర్ మెన్. అందరూ అనుకునేది అబద్ధం. పురుషుల ప్రేమ మరింత నిబద్ధం. బ్రేకప్ నుంచి కోలుకోడానికి యూ టేక్‌మోర్ టైం దేన్ ఉమన్ మై బ్రదర్. నీకు దేవుడి మీద నమ్మకం లేకపోతేనా ఇక ఆత్మహత్యే శరణ్యం.

కానీ, కొంతమందికి సరళరేఖ మీద సాఫీగా సాగిపోయే సెటిల్డ్ లవ్ అంటే ఇష్టం. లవ్ నెవర్ సెటిల్స్ డౌన్-ఎప్పటికప్పుడు స్కోర్లు సెటిల్ చేసుకోడంలోని అలజడిలోని ఉత్కంఠ-ఎక్సయిట్‌మెంట్ లేని రిలేషన్‌షిప్ ఎందుకురా దండగ.

పుట్టు, పెరుగు, పెళ్లాడు, పిల్లల్ని కను. మరెప్పుడు ప్రేమ. రేఖ ఏమని చెప్పింది. ట్రూలీ డీప్‌లీ ఇన్‌సేన్‌లీ స్పెషల్లీ హోప్‌లెస్‌లీ ఇన్ లవ్. హోప్‌లెస్‌గా ప్రేమించడమా? ఏమిటిది ప్రేమలోని తీవ్రవాదమా. మహర్షిగాడి అరాచకమా. దునియా భర్ లవ్ లీజియేగా, ఐ హేవ్ ఇట్ ఫర్ హిమ్! (ఓ ఇంటర్వ్యూలో అమితాబ్ గురించి రేఖ)

అయితే, జీవితమంతా ఎవరి నామస్మరణలో కాలం గడిపామో వాళ్లే తూచ్ అంటే ఇక ఈ జీవితమెందుకు. బట్ రేఖ నెవర్ గేవ్ అప్. తు బదన్ మై హు ఛాయా, తు నహోతో మై కహా హు?

మొపాసా పిపాస వీడలేదు. ప్రేమలకోసం హృదయకోశాల నుంచి కురిసే అమృతధారలకోసం. బిచ్చగాడై తిరిగాడు కదా. ఇది తీరనిదాహం. రాజేష్‌ఖన్నా దేశాలు పట్టిపోయాడు. వో.. ఫిర్ నహీ ఆతే!

సృష్టిలో తీయనిది స్నేహమేనోయి. ఎయిటీస్ హైస్కూల్ బంధాల కొటేషన్ ప్రకారం స్నేహం తీయనిదైతే, ప్రేమ? ఒక్కరుచి కాదుగురూ. అమృతం తాగితే చావుండదు. పలురుచులు లేనిదే బతుకుండదు. బంపీరైడ్‌లోని థ్రిల్, సాదాసీదా సగటు కుటుంబప్రేమలో పండదు. తీపి పులుపు కారం చేదూ కలగలిసిన అనుబంధం, నిరంతర చలనశీలం.

అనుబంధాలన్నీ కాలపరిమితితో పుడుతున్నవేళ. టైమ్ టూ టైమ్ రిఫ్రెష్‌బటన్ నొక్కకపోతే నిలవని ప్రేమ. పరస్పర వ్యతిరేక వ్యక్తుల మధ్య ఐక్యత, ఘర్షణ. ఫ్రిక్షన్‌లోంచి కొత్తదనం.

కొత్తదనంలోంచి ప్రణయపరిమళం. కొంచెం స్ప్రేకొట్టుకోవాలి గురూ. ఎందుకంటే నిలబెట్టుకోడం ఓ ఫీట్. ముఖ్యంగా ప్రేమను. పాతకాలపు సెటప్ సంగతేమోగానీ, కొత్తకాలంలో సర్కస్.

ఇక్కడే కదా అసలు ఎక్సయిట్‌మెంట్ జలజలా ప్రవహించేది. నిరంతరం గెలుచుకుని నిలబెట్టుకోడంలో నీతో నువ్వే పోటీ పడటంలో ఏజ్‌లెస్ రొమాన్స్! పాంపర్‌చేసి, ప్రయిజ్‌చేసి. అలిగి, తొలగి. గెలిచి, ఓడి.


ఈ సందర్భంగా ఓ కొత్త సంగతిరా కొలంబస్. అభం, శుభం తెలియని పిచ్చిపిల్ల తప్ప తెలివిడి ఉన్న లేడీ ఎవరూ నిన్ను నిన్నుగా ప్రేమించదు. అది శ్రీశ్రీగారితో ఎండయిపోయిన ఆశ. దునియా భర్ లవ్ లీజియేగా, ఐ హేవ్ ఇట్ ఫర్ యూ అని ఈ తరం హీరోయినెవరూ చెప్పదు. అది రేఖ చెప్పిన ఆఖరి డైలాగ్. న్యూఏజ్ లవ్‌లో విజేతలవ్వాలంటే, జీవితంలోనూ గెలిచి తీరాలి. గెలుస్తూనే ఉండాలి. గెలుస్తూనే చావాలి. యూ లాస్ట్ లైఫ్. యూ లూజ్ లవ్. ప్రేమంటే సులువు కాదురా. అదొక కెరీర్. ఎప్పుడూ ఫామ్‌లో ఉండాలి. లేదంటే యువార్ అవుటాఫ్ గేమ్.

ఆడకపోతే థ్రిల్‌లేదు. థ్రిల్‌లేనిదే బతుకు లేదు. బతుకంటే ప్రేమ. ఒకపరి తిరస్కారం. ఒకపరి పురస్కారం. రోలర్‌కోస్టర్‌లా సాగే ప్రేమ. ఇన్‌సేన్ అండ్ హోప్‌లెస్!

కానీ, గురూ ఎన్ని చెప్పుకున్నా ఒక పాట మాత్రం వాడిపోదు-మరపురాని బాధకన్నా మధురమేలేదు. ఆ మాధుర్యం కోసమే పిపాసులవుతాం. శలభాలవుతాం. బాటమ్‌లైన్-ప్రేమ: వైల్డెస్ట్ పెయిన్!

అందువల్ల చేత-ఓదార్చుటకు నీవెవరు? ఓదార్పుకు గురి అగుటకు నేనెవరు?

# ఇంద్రధనసు




ఫేర్ వెల్ టూ యూ. ఆల్ ద బెస్ట్ టూ మీ. వీడ్కోలు చెప్పడమెలాగో నేర్చుకో. ప్రేమకైనా ప్రాణానికైనా, ప్రాణాన్నిమించిన ప్రేమకైనా. వమ్ముకాదనుకున్న నమ్మకానికైనా, వికలమవదనుకున్న విశ్వాసానికైనా. ఎప్పటికైనా వీడ్కోలు చెప్పకతప్పదు. స్పర్శల జాడలకైనా, జ్ఞాపకాల నీడలకైనా వీడ్కోలు తప్పదు. పాయింట్ టూ పాయింట్-స్టేజి కేరియర్. ఎక్కడ దిగేవాడు అక్కడ. ఎక్కడ ఎక్కేవాడు అక్కడ-గప్‌చుప్. తప్పు ఎంత మాత్రమూ తనది కాదు.

తెలిసీ వలచుట తొలినేరం. ఆత్రేయ చెప్పినా వినలేదేమిరా నాయనా. తెలిసి తెలిసి విలపించుటలో తీయదనం? బిట్టర్ స్వీట్ అంటే ఇదేనా మడోనా! ది పవర్ ఆఫ్ గుడ్‌బై.

అదేంటో తెలియదు. కానీ వీడ్కోలు చెప్పాలంటే చాలా శక్తి కావాలి. పైగా ఇది పగటికి రేయి రేయికి పగలూ పలికే వీడ్కోలు కాదు. వేరే!

అయినా ఆ హృదయద్వారం మరెవరికోసమో తెరచి ఉన్నప్పుడు రమ్మన్నా వెళ్ళి ఫలితంలేదు. ఆ హృదయ వేదిక ఎవరికో శయ్య కానున్నప్పుడు ఆశలు వికసించి అస్సలు ఉపయోగం లేదు. వీడ్కోలు స్వేచ్ఛాగీతమట-దేని నుంచి దేని కొరకు దేని వలన స్వేచ్ఛ. బందీ అవుతావో లేదో నీ ఇష్టం. బంధించే హక్కు నీకెక్కడిది.

పోయేదేమీ లేదు. ఈ గుండె మీద కొత్త గాయాలకు చోటులేదు. దాక్కోడానికి రహస్యస్థలాలు లేవు. కప్పుకోడానికిక ముఖాలు మిగిలిలేవు. వీడ్కోలు చెప్పడానికి గుండె కావాలి. దాని నిండా ధైర్యం కావాలి. కానీ నిండుకుండలే జాగ్రత్తగా ఉండాలి-నీరైనా నిప్పయినా!

నువు డ్రీం సాంగైతే వేసుకోలేవు. ఎక్కడ ఉన్నా ఏమైనా తన సుఖమే నువు కోరుకున్నా కోరుకోకపోయినా ప్రాబ్లమేమీ లేదు. ఓరీ మధ్యయుగపు కాదలన్! తన సుఖం తాను కోరుకోడం ముఖ్యం. నువు వీడ్కోలు చెప్పడమే మహాభాగ్యం.

చెప్పరా ఓ తెలుగువాడా పాడరా ఓ పాచిపాట. ప్రియా నీ జ్ఞాపకాలు చాలు వాటితో బతికున్నంతకాలం బతికేస్తాను. కిసుక్కు కర కర కిసుక్కు కిర్. నవ్వుతారురా. మరపురాని బాధ కన్నా మధురమే లేదూ. గతము తలచీ వగచే కన్నా సౌఖ్యమే లేదో. అందరానీ పొందుకన్నా అందమే లేదూ-వాడి కర్మ. రొమాంటిక్ కష్టాల సెల్ఫ్ డిస్ట్రక్షన్! అందరానిదాని సంగతొదిలేయ్. చెయిజారిన పొందు?

నువ్వెవరయ్యా బాబూ-చేయి జారుతుందని తెలియదా. మనం ముందే చెప్పుకున్నట్టుగా తెలిసి కూడా వలచి మరి ఇపుడిక్కడ ఏడుస్తూకూచుంటే-టైం లేదు గురూ తర్వాత కలుద్దాం. ఈ లోగా వెళ్ళి ఆ కన్ఫెషన్ క్యూబికల్ ముందు మోకరిల్లి ధ్యానం చెయ్.

మామూలుగా మనం చెప్పాలంటే: వన్ లైఫ్ టూ లివ్. వన్ లవ్ టూ లవ్. ఇంకొంచెం ఎక్స్ట్రా నెయ్యీ కారం పొడి వేయాలంటే వన్ లవ్ టూ లివ్ ఫర్!

డూ యూ థింక్ ఇటీజ్ పాజిబుల్. ప్రేమంటే కమిట్‌మెంట్ల కట్టా?

ఇది బూస్ట్‌లోని సీక్రెట్ ఆఫ్ ఎనర్జీ కాదు. నీ గుండె కండరాల రిటైనింగ్ పవరెంతో చెప్పు. ఫేర్‌వెల్ ఈజ్ ద టైం యూ స్టార్ట్ మిస్సింగ్ గెమ్. వీడ్కోలు చెప్పాలంటే మామూలు పని కాదురా అన్నా. దానికన్నా అసలా సిచ్యుయేషన్ తెచ్చుకోకుండా ఉండటమే బెటర్.

ప్రేమలు దక్కని బ్రతుకేలాయని బెంగపడిపోతున్నావు కదూ. దిగులు మేఘాల మధ్య, దారి తెలియని మసక చీకట్ల ముసురు మధ్య; గుబులు గుండె శబ్దాన్ని ఏకాంతంగా వింటున్నావు కదూ. వద్దు ఏడవద్దు. మగాడినై ఆడపిల్లల ఫెయిర్‌నెస్ క్రీమా! కమాన్ హాండ్‌సమ్. పాత సామెతలూ సూత్రాలూ చట్రాలూ చట్టాలూ సతీవ్రతాలూ పతీధర్మాలూ చూసి భయపడవద్దు. ప్రేమలు ప్రణాళికలు కావు. ప్రేమలు సంభవాలు. యూ డోంట్ నో వెన్ యూ ఫాలిన్‌లవ్. సమయమూ సందర్భమూ లేకుండా హెచ్చరికలు ఎగురవేయకుండా వచ్చి ముంచే విస్మయాలు విభ్రమాలు విచిత్రసంచలనాల మనోవిన్యాసాలు.

తప్పు తనది కాదు నీది. ఎప్పటికైనా వీడ్కోలు చెప్పక తప్పదని తెలిసీ... నువ్వే అపరాధి.

నీకు దమ్మూ్మధనియాలూ ఉంటే వీడ్కోలు చెప్పు నీకు దిధై ఉంటే వీడ్కోలును ఫ్లయింగ్‌కిస్‌లా క్యాచ్‌చేసి పాకెట్‌బుక్ పేజీల్లో నెమలిఫింఛంలా పడేసి మర్చిపో.

కానీ, నాకు తెలుసురా. నీకేకాదు హృదయం ఉన్న ఎవడికైనా వీడ్కోలు చెప్పడమంటే గుండెను పీకి నేలకేసి రుద్దడమే. ఒసేయ్! ఈ బాధ భరించలేనే. ప్రాజాక్‌లో జవాబుందా, మేన్షన్‌హౌస్లో శాంతి ఉందా?



ఏది ఏమైనప్పటికినీ ఫొటోలు తగులబెట్టినా చెట్టుకు శవాలై
వేలాడుతుండగా భుజాన తుపాకీ పెట్టుకుని ఫోజులిచ్చినా,
చివరకు పోయెమ్స్ ఫర్ మెన్ అని కేటగరైజ్ చేయబడిన ఈ
కవిత్వమును స్త్రీలు కూడా చదివి అర్థం చేసుకుని
అభిమానిస్తారనుటకు సందేహము లేదు.